
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
శుక్రవారం, 30 మే 2025



తొలి బడి అమ్మ ఒడి..
మలి బడి అంగన్‌వాడీ..

- అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేస్తాం
- ఆశా వర్కర్లకు జీతాలు పెంచుతాం..
- చిరుద్యోగుల కష్టాలు, కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యం
- 'మిషన్ వాత్సల్య' కింద తల్లిదండ్రులు లేని పిల్లలకు నెలకు రూ.4వేలు
- పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- కొత్తగూడెంలో 'ఇందిరమ్మ అమృతం' పథకానికి శ్రీకారం



కొత్తగూడెంలో ఇందిరమ్మ అమృతం పథకం ప్రారంభ సభలో మాట్లాడుతున్న సీతక్క

కొత్తగూడెం, మే 29 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు తొలి బడి అమ్మ ఒడి అయితే.. మలి బడి అంగన్‌వాడీ అని, అలాంటి అంగన్‌వాడీ బడుల్లో పనిచేసే టీచర్లకు రూ.2లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ రాష్ట్రమంత్రి సీతక్క పేర్కొన్నారు. చిరు ఉద్యోగుల కష్టాలు, కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆశా వర్కర్లకు జీతాలను కూడా పెంచుతామన్నారు. కిషోర బాలికలకు పౌష్టికాహారం అందించేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ అమృతం పథకాన్ని గురువారం ఆమె భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో శ్రీకారం చుట్టారు. కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీతక్క మాట్లాడుతూ.. మిషన్ వాత్సల్య పథకం కింద తల్లిదండ్రులు లేని పిల్లలకు నెలకు రూ.4వేలు అందజేస్తామని, చదువుతోనే ఆడ పిల్లల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. 'ఆడపిల్లలకు శక్తినిద్దాం.. ఆరోగ్య తెలంగాణ నిర్మిద్దాం' అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ అమృతం పథకాన్ని రూపొందించిందన్నారు. కౌమార బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని, ప్రయోగాత్మకంగా భద్రాద్రి కొత్తగూడెం, కొమరం భీం, ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా మూడు జిల్లాలో 50,269 మంది బాలికలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో (మిగతా 6వ పేజీలో)

కార్పొరేషన్‌గా కొత్తగూడెం..

- అప్‌గ్రేడ్ చేస్తూ మున్సిపల్ శాఖ జీవో జారీ
- ప్రభుత్వ విధి విధానాలు విడుదల
- కమిషనర్‌గా సుజాత నియామకం



6

అభివృద్ధిలో ఉమ్మడి జిల్లా
నెంబర్‌వన్‌గా నిలవాలి

- ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలి
- రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా చేపట్టండి
- నకిలీ విత్తనాలమ్మే వారిపై పీడీ యాక్టు పెట్టండి
- నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు అందాలి
- భూ భారతి కింద జూన్ 3 నుంచి 20 వరకు సదస్సులు
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- ఇరుజిల్లాల అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, కోమటిరెడ్డి ఆదేశాలు
- ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి సమీక్ష



సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి, కోమటిరెడ్డి

ఖమ్మం,మే 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా నిలవాలని, ఇందుకోసం అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, వర్షాకాలం పొంచిఉన్న వ్యాధులు, విత్తనాలు, ఎరువులు తదితర అంశాలపై జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ ప్రధాన్యత కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని, ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు లేకుండా త్వరితగతిన పూర్తి చేసిన అధికారులను అభినందించారు. రైతులను నష్టపరిచేలా నకిలీ విత్తనాల అమ్మే వారిపై కఠినంగా వ్యవహరించాలని, అవసరమైతే పీడీయాక్టు పెట్టి, నకిలీ విత్తనాలు అమ్మాలంటే భయపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన వారికే అందేలా చూడాలని, భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో అభివృద్ధి సంక్షేమాన్ని పరుగులు తీయించాలని ఆదేశించారు. ఇక ఈ సమీక్షలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మాలోతు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి తదితరులు తమతమ నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. సుదీర్ఘంగా సాగిన ఈ సమీక్షలో ఒక్కో విభాగంపై విస్తృత చర్చ జరిగింది.

అసైన్డు భూముల్లో సాగులో ఉన్నవారికి పట్టాలు

పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి

జూన్ 3నుంచి 20వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని, అత్యవసరమైతే తప్పా అధికారులకు సెలవులు ఇవ్వొద్దని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో సాగుదారులుగా ఉన్న వారికి పట్టాలు ఇవ్వనున్నామని, ఇందుకు సంబంధించి ప్రభుత్వం త్వరలోనే విధి విధానాలు ప్రకటిస్తుందన్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించి (మిగతా 6వ పేజీలో)

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి



తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ మంత్రి

ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి ఉమ్మడి జిల్లాలోకి నకిలీ విత్తనాలు రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం తనిఖీలు చేయాలని, విత్తనాలు, ఎరువుల కొరత రానీయొద్దని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఉమ్మడిజిల్లాలో ధాన్యం కొనుగోలు విజయవంతంగా చేసినట్టుగానే ఎరువులు, విత్తనాల సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఆ బాధ్యత అధికారులదేనని, నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ నుంచి రాకుండా సరిహద్దులో నిఘా పెంచడంతో పాటు అవసరమైతే అక్కడి అధికారులను కూడా సంప్రదించాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లు మిగిలి ఉంటే పూర్తి చేయండి



మల్లు భట్టి విక్రమార్క, ఉప ముఖ్యమంత్రి

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల సక్రమంగా జరిగాయని, ఇందుకు కృషి చేసిన కలెక్టర్లను, అధికారులను భట్టి విక్రమార్క అభినందించారు. ఇంకా ఎక్కడైనా ధాన్యం కొనుగోళ్ల మిగిలి ఉంటే సత్వరమే పూర్తి చేయాలన్నారు. విత్తనాల సీజన్‌లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు అమ్మేవారిపై పీడీ యాక్టు లాంటి కఠినమైన కేసులు పెట్టాలని, అవసరమైతే పొరుగున ఉన్న ఏపీ ప్రభుత్వంతో మాట్లాడి అక్కడి అధికారులను సమన్వయం చేసుకుంటూ నకిలీ విత్తనాలను నివారించాలన్నారు. గత ప్రభుత్వం ధరణితో రైతులు,పేదలకు భూములపై ఉన్న హక్కులను దూరం చేసిందని, భూ భారతితో రైతుల కష్టాలు తొలగిపోతున్నాయన్నారు. జూన్2 రాష్ట్ర అవతరణ దినోత్సవాన అర్హులైన నిరుద్యోగ యువతకు రాజీవ్‌యువ వికాసం కింద మంజూరు పత్రాలు ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఆరోజున సాయంత్రం జిల్లా కేంద్రాలతోపాటు నియోజక వర్గ కేంద్రాల్లో సాంస్కృతిక కార్యక్రమాలునిర్వహించాలని ఆదేశించారు.



దమ్మపేటలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

నాటి ఎన్టీఆర్ పథకాలు
చిరస్మరణీయం

- ఆయన జన్మ ఒక అద్భుతం
- ఆయనో మానవతావాది
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- దమ్మపేటలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

7

ఆదాయంతో పాటే వ్యయం..



- పెరుగుతున్న భద్రాద్రి దేవస్థానం ఖర్చులు
- 2024-25లో వచ్చిన ఆదాయం రూ.78,64,16,005
- ఖర్చయింది రూ.70,99,41,126
- ఆన్‌లైన్ ఆర్జిత సేవల ద్వారా రూ.3.60 కోట్లు రాక



భద్రాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పుణ్యక్షేత్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వచ్చే ఆదాయంతో పాటు వ్యయం కూడా పెరుగుతుండటం గమనార్హం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేవస్థానానికి రూ.78,64,16,005ఆదాయం రాగా, రూ.70,99,41,126 ఖర్చులయ్యాయి. ఇక ఆన్‌లైన్ సేవల ద్వారా రూ.3.60 కోట్ల ఆదాయం సమకూరింది. దేవస్థానంలో సుమారు రెండేళ్లుగా అధికారులు చేపడుతున్న సాంకేతికపరమైన విధానాల కారణంగా ఆదాయం పెరుగుతూ వస్తోంది. పూర్తి పారదర్శకత కోసం కంప్యూటరైజ్డ్ టికెట్లు, వివిధ ఆర్జిత సేవలు, ఆన్‌లైన్‌లో గదులు నమోదు చేసుకునేలా వెబ్‌సైట్, యాప్ రూపకల్పన చేశారు. అలాగే బార్‌కోడింగ్, ఉచిత నిత్యాన్న దానానికి భక్తులకు ఈ-టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. అలాగే బంగారం, వెండి ఆభరణాలు అందజేసే వారికి అందజేసే డిజిటల్ రశీదు పత్రంపైనే వారు అందజేసే ఆభరణం ఫొటో, దాని విలువ, ఇతర వివరాలను పొందుపరుస్తున్నారు. ఈ క్రమంలో రాబోయే రెండేళ్లలో భద్రాద్రి దేవస్థానం ఆదాయం రూ.100కోట్లను చేరడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇదిలా ఉండగా దేవస్థానం కామన్‌గుడ్‌ఫండ్(సీజీఎఫ్), ఎండోమెంట్స్ అడ్మినిస్ట్రేషన్ ఫండ్(ఈఎఎఫ్), అర్చకా వెల్ఫేర్ ఫండ్ (ఎడబ్ల్యూఎఫ్), ఆడిట్ ఫీజ్ కింద 21.5 శాతం ఆదాయంలో చెల్లించాల్సి వస్తోంది. ఈ రీతిన గత ఏడాదిన్నర కాలంలో రూ.8కోట్లు పైనే చెల్లింపులు చేసినట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో 2023 ఆగస్టు 15 నుంచి ఆన్‌లైన్ పద్ధతిని ప్రారంభించగా 2023-24లో రూ.1.66కోట్లు ఆదాయం ఆన్‌లైన్ ద్వారా వచ్చింది. 2024-25లో రూ.3.60 కోట్ల ఆదాయం సమకూరింది.

ప్రసాదాల తయారీకి రూ.7కోట్లు

దేవస్థానంలో లడ్డూ, పులిహోర, చెక్కర పొంగలి తదితర ప్రసాదాల తయారీకి దేవస్థానం ప్రతీ ఏడాది రూ.7కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. కాగా ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.9.50కోట్ల వరకు ఆదాయం లభిస్తోంది. అదేవిధంగా విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం ఏడాదికి రూ.57లక్షలు చెల్లిస్తుండగా (మిగతా 6వ పేజీలో)



కొత్తగూడెం ఓఎస్డీగా నరేందర్

బాధ్యతల స్వీకరణ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 29 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) ఓఎస్డీగా జి.నరేందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 1996 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన నరేందర్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాంతానికి చెందిన వాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బదిలీల్లో భద్రాద్రి జిల్లా అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) పదోన్నతి కల్పించింది. వెయిటింగ్‌లో ఉన్న నరేందర్ తొలి పోస్టింగ్‌గా ఎఎస్పీ హోదాలో కొత్తగూడెం ఓఎస్‌డిగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి నేరుగా తీసుకొని రావాలని ఓఎస్డీ స్పష్టం చేశారు.

ఇక యువతకు ఆర్థిక వికాసం

- ఖమ్మం జిల్లాలో 95,325 రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు ఆన్‌లైన్
- 1:2 నిష్పత్తిలో ఎంపికలకు కసరత్తు పూర్తి
- జూన్ 2 నుంచి లబ్ధిదారుల ఖాతాల్లోకి రుణాలు
- చెక్కులు సిద్ధం చేస్తున్న అధికారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పథకాల్లో రాజీవ్ యువ వికాసం ఎంతో కీలకమైంది. విద్యాభ్యాసం చేసిన నిరుద్యోగులకు పలు ఉద్యోగ ఎంపిక పరీక్షల ద్వారా ఉద్యోగాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు నిరుద్యోగ, చేతి వృత్తులు చేసుకునే యువతకు ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని రూపొందించారు. రూ.50వేల నుంచి రుణాల అర్హతను బట్టి రూ.4లక్షల వరకు సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేయనున్నారు. ఇప్పటికే ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పర్యవేక్షణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సాంఘిక సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరణ, పరిశీలన, ఆన్‌లైన్ తంతు పూర్తయింది. 39,616 బీసీ దరఖాస్తులు, 29,742 ఎస్సీ దరఖాస్తులు, 14,416 గిరిజన దరఖాస్తులు, 7,412 మైనార్టీ దరఖాస్తులు, 2,794 ఈబీసీ దరఖాస్తులు, 117 క్రిస్టియన్ మైనార్టీ దరఖాస్తులు, ఎంబీసీ 1,228 మొత్తం 95,325 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. ఆయా దరఖాస్తుదారుల ఆధార్, బ్యాంకు ఖాతా, ఇతర వివరాలను కార్పొరేషన్ల ఆధ్వర్యంలో బ్యాంకర్లకు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

1:2 నిష్పత్తిలో రుణాలకు అవకాశం

జిల్లా వ్యాప్తంగా 95,325 దరఖాస్తులను ఆశావహులు నమోదు చేయించుకోగా ప్రభుత్వం మాత్రం 20,200 యూనిట్లుకు లబ్ధిదారులకు తొలి విడతలో రుణాలను ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో వచ్చిన దరఖాస్తుల్లో మరోసారి అర్హత జాబితాలను బయటకు తీసే అవకాశం ఉంది. దరఖాస్తు చేసిన వారిలో అత్యంత నిరుపేదలు, గత ఐదేళ్లలో రుణాలు తీసుకొని వారు, బ్యాంకు సిబిల్ స్కోర్ అధికంగా ఉన్న వారికి రాజీవ్ యువ వికాసంలో తొలి విడతగా రుణాలను ఇవ్వటానికి ఎంపిక చేసే అవకాశం ఉంది. దీంతో 1:2 నిష్పత్తిలో రుణాలు అందుతాయని అధికారులు అంచనాలు వేస్తున్నారు.



లబ్ధిదారుల జాబితాలను ఆన్‌లైన్ చేస్తున్న అధికారులు

జూన్ 2 నుంచి రుణాల మంజూరు

దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, శాఖలవారీగా ఆన్‌లైన్ నమోదు తర్వాత బ్యాంకర్లకు దరఖాస్తులను అందజేయడంతో ఇక రుణాల పంపిణీపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. బ్యాంకర్లకు అందజేసిన వాటిలో సిబిల్ స్కోర్ ఇతర అర్హత అంశాలను పరిశీలించిన తర్వాత 7వేల దరఖాస్తులు రుణాలు పొందేందుకు అర్హత పొందినట్టు అనధికారిక సమాచారం. వీరిలో కొంతమందిని ప్రాంతాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసి జూన్ 2న రాజీవ్ యువ వికాసం రుణాలను పంపిణీ చేసేందుకు అధికారులు కార్యాచరణ చేస్తున్నారు. ఈ మేరకు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలను బ్యాంకర్లకు సిపారసులు చేశారు.



అర్బన్ మండలంలోని ఓ విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

రంగంలోకి టాస్క్‌ఫోర్స్!

- నకిలీ విత్తన నియంత్రణపై ఫోకస్
- అక్రమార్కులపై ఉక్కుపాదం మోపేలా కసరత్తు
- తనిఖీలు చేస్తున్న పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు
- ఖమ్మం అర్బన్ మండలంలో విత్తన దుకాణాల్లో పరిశీలన

7

ఏన్కూరు మండలంలో
390 ప్యాకెట్లు లభ్యం?

విచారణ చేస్తున్న పోలీసులు



ఇటీవల ప్రారంభమైన టీ షాప్

బినామీలకు టీ షాప్

- మహిళా సాధికారతకు తూట్లు
- ఎస్‌హెచ్‌జీ సభ్యుల స్థానంలో ప్రభుత్వ డ్రైవర్ల కుటుంబాలకు ఉపాధి
- తర్వాత మారుస్తాం.. : డీఆర్డీవో సన్యాసయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే వినూత్నంగా మహిళా సాధికారతకు ఖమ్మం కలెకర్ ముజమ్మిల్‌ఖాన్ విశేషంగా కృషి చేస్తున్నారు. మహిళా క్యాంటీన్లు, మహిళా మార్టులను ఏర్పాటు చేసి రాష్ట్ర స్థాయిలో ఖమ్మం మహిళా సంఘాల్ని అభివృద్ధిలో ముందు వరసలో ఉంచుతున్నారు. అయితే కొంతమంది గ్రామీణాభివృద్ధి అధికారుల తీరు వివాదాస్పదంగా మారుతోంది. ఖమ్మంలో ఇటీవల ఎంతో ప్రతిష్టాత్మకంగా టీ షాప్‌ను ప్రారంభించారు. మహిళా స్వయం సహాయక సంఘంలోని సుజాత అనే సభ్యురాలికి టీ షాప్‌ను అధికారికంగా కేటాయించారు. కానీ టీ షాప్ నిర్వహణ మాత్రం డీఆర్డీఏ అధికారి డ్రైవర్ కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నారు. దీంతో టీ షాప్ వద్దకు వచ్చిన డీఆర్‌డీఏ, మెప్మా ఉద్యోగులు బినామీలకు టీ షాప్ ఇవ్వటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అర్హత కలిగిన మహిళా స్వయం సహాయక సభ్యులకు ఇవ్వాలని కోరుతున్నారు. కాగా ఈ విషయంపై డీఆర్డీవో సన్యాసయ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కొద్దికాలం పాటు ఇవ్వటం జరిగిందని తర్వాత మారుస్తామని సమర్థించుకున్నారు.

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు

- గ్రామాల్లో సర్పంచ్‌లుంటేనే అందంగా ఉంటుంది
- కేంద్రం నుంచి నిధులు ఆగిపోయాయి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

భద్రాచలం/పాల్వంచ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి గ్రామాలకు వచ్చే నిధులు ఆగిపోయాయన్నారు. భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామిని గురువారం ఆమె దర్శించుకున్నారు. అనంతరం కొద్దిసేపు విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో చాలావరకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లుంటేనే అందంగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే బీసీ రిజర్వేషన్లలో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా కసరత్తు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం బాగుండాలని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని భద్రాద్రి రామయ్యను మొక్కినట్టు తెలిపారు. అంతకుముందు



కాంగ్రెస్ భూన్ యాది సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

భద్రాద్రి రామాలయాన్ని దర్శించిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలకు దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్ పాల్గొన్నారు.

ఆదివాసీలే దేశానికి మూలవాసులు..

ఆదిమ సమాజం నుంచి నేటి వరకు ఆదివాసీలే దేశానికి మూలవాసులని చరిత్ర చూపిస్తోందని పంచాయతీరాజ్, మహిళ శిశుసంక్షేమ శాఖ రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. గురువారం కిన్నెరసానిలో మూడు రోజులపాటు జరుగుతున్న ఆదివాసీ కాంగ్రెస్ భూన్‌యాది శిక్షణ తరగతులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశ అధినేత రాహుల్‌గాంధీ ఆదేశానుశారం ప్రతి రాష్ట్రంలో ఆదివాసీలను రాజకీయంగా చైతన్యపర్చేందుకు శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నటరాజన్ ఆదేశాల మేరకు మారుమూల ప్రాంతంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



రామాలయంలో మంత్రి సీతక్క

నియోజకవర్గానికి 20 మంది కార్యకర్తల చొప్పున ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారన్నారు. రాష్ట్రాల వారీగా శిక్షణ తరగతుల అనంతరం రాహుల్‌గాంధీ సమక్షంలో ఢిల్లీలో దేశ వ్యాప్తంగా శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆదివాసీ హక్కులను కాలరాసేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. రాజ్యాంగంలోని 5,6 షెడ్యూళ్లను రక్షించుకోవాల్సిన బాధ్యత ఆదివాసీలపై ఉందన్నారు. ఆదివాసీ ప్రపంచ దినోత్సవం సందర్భంగా జూన్ 9న ఢిల్లీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టేందుకు కార్యాచరణ తీసుకుంటున్నామన్నారు. సేవ్ ఆదివాసీ పేరుతో ఈ కార్యక్రమం మొదలవుతుందన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ఆదివాసీ యువత సాంస్కృతిక, సాంప్రదాయాలను మరోసారి నెమరేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. కనుమరుగు అవుతున్న ఆదివాసీ సాంప్రదాయాలను ఈ శిక్షణ తరగతుల్లో ప్రొఫెసర్ల ద్వారా తెలుసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, ఎంపీ బలరాం నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, ఆదివాసీ సంఘం నాయకులు, మాజీ చైర్మన్ చందా లింగయ్య దొర, ఆదిలాబాద్ మాజీ ఎంపీ బాబురావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు, ఎడవల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మధువరణ్

జాతీయ సదస్సుకు

భద్రాద్రి ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ సదస్సుకు భద్రాద్రి ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మధువరణ్ ఢిల్లీలో గురువారం హాజరయ్యారు. యూనిసెఫ్ సహకారంతో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ జాతీయ సదస్సుకు జిల్లా నుంచి హాజరయ్యారు. మానవ ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావాలు, దేశంలో వాతావరణ అనుకూలత కోసం ఆవిష్కరణలు, పరస్పర అధ్యాయనాన్ని బలోపేతం చేయడం అనే అంశాలపై ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ప్రముఖులు ఈ సదస్సులో అందించే విధాన నిర్ణయాలు, వైద్య ఆరోగ్యపరంగా నిపుణుల సలహాలు నిర్వాహకులు తీసుకోనున్నారు.

ఐటీసీ కర్మాగారంలో కార్మికుడి మృతి



హరీష్ మృతదేహం

బూర్గంపాడు, మే 29(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల ఐటీసీ కర్మాగారంలో గురువారం విధులు నిర్వహిస్తున్న ఓ కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం...దుమ్ముగూడెం మండలం కమలాపురం గ్రామానికి చెందిన పర్సిక హరీష్(24) ఐటీసీ కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం విధులకు హాజరైన ఆయన పై నుంచి పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు క్షతగాత్రుడిని భద్రాచలం ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహానికి కార్మిక సంఘాల నాయకులు నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్, ఐఎన్‌టీయూసీ నాయకులు యారం పిచ్చిరెడ్డి తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేషన్‌గా కొత్తగూడెం..

- అప్‌గ్రేడ్ చేస్తూ మునిసిపల్‌శాఖ జీవో జారీ
- ప్రభుత్వ విధి విధానాలు విడుదల
- కమిషనర్‌గా సుజాత నియామకం

కొత్తగూడెం, మే 29 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ మేరకు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్‌గా సుజాతను నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ కింద కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతోపాటు సుజాతనగర్ మండలంలోని మంగపేట, నాయకులగూడెం, కోమటపల్లి, నిమ్మలగూడెం, సుజాతనగర్, నర్సింహసాగర్, లక్ష్మీదేవిపల్లి, కుమ్మరిగూడెం తదితర గ్రామాలను విలీనం చేస్తూ కొత్తగూడెం కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ జరిగింది. సుజాతనగర్ మండల పరిధిలో కలిసిన గ్రామ పంచాయతీలు ఉండవని వాటి పరిధిలో కార్పొరేషన్ వార్డులను ఏర్పాటు చేయనున్నారు. అయితే ఇప్పటికే పాల్వంచ, కొత్తగూడెం మునిసిపాలిటీలో 60 వార్డులు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్ కింద విలీనమైన పట్టణాలు, గ్రామాలను కలిపి త్వరలో కార్పొరేషన్ వార్డులను రూపొందించనున్నారు. అయితే గురువారం నుంచే కొత్తగూడెం కార్పొరేషన్‌గా అమలులోకి వస్తుందని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కొత్తగూడెం మునిసిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేసిన ఫలితంగా టీఎం చట్టం 2019లోని సెక్షన్ 53లో పేర్కొన్న విధులను నిర్వర్తించడానికి మరొక కమిషనర్‌ను నియమించే వరకు అధికారాలను వినియోగించడానికి, విధులు నిర్వర్తించడానికి కమిషనర్‌ను నియమించడం అవసరం ఉంటుంది.



సుజాత, కార్పొరేషన్ కమిషనర్

కార్పొరేషన్ ఎన్నికలు జరిగే వరకు అధికారాలను, విధులను నిర్వర్తించడానికి ప్రత్యేక అధికారిని నియమించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని పాల్వంచ మునిసిపల్ కమిషనర్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కే.సుజాతకు కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ పదవికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్పొరేషన్‌లో విలీలమైన సుజాతనగర్ మండలంలోని గ్రామ పంచాయతీల మినిస్ట్ పుస్తకాలను నిలిపివేయనున్నారు. కొత్తగా ఏదైన జాతీయ బ్యాంకులో ఖాతాలు కూడా తెరవనున్నారు. ప్రస్తుతం ఉన్న ఆ బ్యాంకు ఖాతాలను మూసివేస్తారు. కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం, ఇతర బోర్డులపై కొత్తగూడెం కార్పొరేషన్‌గా పేరు నమోదు చేసే బోర్డు ఏర్పాటు చేయనున్నారు. ఆయా గ్రామపంచాయతీలో పని చేసే ఉద్యోగుల వివరాలు, గ్రామ పంచాయతీల యాజమాన్యంలోని ఆస్తులు, స్థిరాస్తులు గ్రామ పంచాయతీల వద్ద ఉన్న డిపాజిట్లు, పన్నులు, గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న పథకాల వివరాలు చెల్లించాల్సిన పన్నులు, సామగ్రి బిల్లులు, గత మూడేళ్లలో జారీ చేసిన భవనం, లేఅవుట్ల అనుమతులు, గత గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు స్థిర స్తిరాస్తులను కొత్తగూడెం కార్పొరేషన్‌కు బదిలీ చేయాల్సి ఉంటుంది. మొత్తం మీద కొత్తగూడెం కార్పొరేషన్ అప్‌గ్రేడ్ కావడంతో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతోపాటుగా సుజాతనగర్ మండలంలోని కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామ పంచాయతీల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన కొత్తగూడెం మునిసిపల్ కార్యాలయం

తొలి బడి అమ్మ ఒడి..

మలి బడి అంగన్‌వాడీ..



ఇందిరమ్మ అమృతం పథకం ప్యాకెట్లను అందజేస్తున్న మంత్రి సీతక్క

(5వ పేజీ తరువాయి)

ఆడపిల్లలు సరైన పౌష్టికాహారం లేక అనేక రకాలుగా రక్తహీనతతో వ్యాధులు పౌష్టికాహార లోపం తలెత్తుతోందన్నారు. 14 నుంచి 18 సంవత్సరాల్లోపు బాలికలకు ఈ పథకం ద్వారా మిల్లెట్స్‌తో చేసిన చిక్కీలు (పల్లీ, చిరుధాన్యాల పట్టీలు) నెలకు రెండు ప్యాకెట్లను అందజేస్తున్నామన్నారు. ఒక్కో ప్యాకెట్‌లో 15 చిక్కీలు ఉంటాయని, రోజుకు ఒక చిక్కి తినడం ద్వారా ఆడపిల్లలు నెలసరి సమయంలో వచ్చే సమస్యలు, రక్తహీనతలు తగ్గి శక్తిని పొందుతారన్నారు. అంగన్‌వాడీకేంద్రాలను ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చామని, పిల్లలందరికీ నర్సరీ పాటలతోపాటు ఆహారం అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేస్తున్నామన్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ఏకరూప దుస్తులను అందిస్తున్నామని, పిల్లలు ఆడుకోవడానికి 57రకాల ఆటవస్తువులను అందుబాటులో ఉంచామన్నారు. గర్భిణులు కింద కూర్చోవాల్సిన అవసరం లేకుండా బెంచీలను ఏర్పాటుచేస్తామన్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న బాలామృతంలో మార్పులు చేసి పిల్లలు ఇష్టంగా తినేవిధంగా రుచికరమైన పదార్థాలతో వారి ఆరోగ్యాన్ని పెంపొందించి బలంగా తయారయ్యేలా అందిస్తామన్నారు. పిల్లలను ఆకర్షించేలా బొమ్మలు, పెయింటింగ్ లాంటివి ఏర్పాటు చేసి వాటి ద్వారా పాఠాలు బోధించాలన్నారు. జిల్లాలో మహిళ, శిశుసంక్షేమ శాఖ తయారు చేసిన 'వేస్ట్ నుంచి బెస్ట్' చాలా ఆకర్షించిందని వాటిని రాష్ట్ర వ్యాప్తంగా చూపుతామన్నారు. మొట్టమొదటిసారిగా అంగన్‌వాడీ కేంద్రాలకు నెలరోజులపాటు వేసవి సెలవులను ప్రకటించామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ2లక్షలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క రెండు రోజుల క్రితం సంతకం చేశారని తెలిపారు. చిరు ఉద్యోగుల కష్టాలు, కన్నీరు తుడవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాబోయే కాలంలో ఆశా వర్కర్ల జీతాలను పెంచి వారిని రెగ్యులరైజ్ చేస్తామన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలు బాధపడవద్దని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని, నెలకు వారికి రూ.4వేలను అందజేస్తుందని తెలిపారు. ఈ పథకం కింద భద్రాద్రి జిల్లాకు మంజూరైన రూ.74.64లక్షల చెక్కును పిల్లలకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటుచేసిన వివిధ స్టాళ్లను మంత్రి పరిశీలించారు. 'వేస్ట్ నుంచి బెస్ట్'గా రూపొందించిన కళాకృతులను చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, జిల్లాలోని ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావ్ కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, మహిళ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రాంచంద్రన్, డైరెక్టర్ కాంతివెస్లీ, ఐటీడీఏ పీవో రాహుల్, జడ్పీసీఈవో నాగలక్ష్మి, సీపీవో సంజీవరావు, మహిళ శిశుసంక్షేమశాఖ జిల్లా అధికారి స్వర్ణలత లెనినా, తదితరులు పాల్గొన్నారు.

కస్తూరి జింక అవశేషాల ఘటనపై కేసు

అశ్వారావుపేట, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వినాయకపురంలో హఫీజ్ ఇంట్లో కస్తూరి జింక అవశేషాలను అటవీశాఖాధికారులు స్వాధీనం చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేసినట్లు అశ్వారావుపేట అటవీశాఖ రేంజ్ అధికారి మురళి తెలిపారు. సంఘటనతో పాటు అందుకు బాధ్యులైన వ్యక్తులు హఫీజ్, మధు అనే వ్యక్తులపైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే పట్టుబడిన అవశేషాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించడం జరిగిందని, రిపోర్ట్ వచ్చిన తరువాత తదుపరి చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. పూర్తిస్థాయి విచారణ జరుగుతుందని చెప్పారు.

అభివృద్ధిలో ఉమ్మడి జిల్లా

నెంబర్‌వన్‌గా నిలవాలి

(5వ పేజీ తరువాయి)

కొందరు సాదాబైనామాకు దరఖాస్తు చేశారని వాటిని తిరస్కరించాలని సూచించారు. హైకోర్టునుంచి స్టే తొలగిన వెంటనే అర్హత ఉన్న సాదాబైనామా రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేంద్రప్రభుత్వం కేవలం రూ.70వేలు మాత్రమే ఇస్తుందని రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు ఖర్చుచేస్తుందని, ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదలకు పక్కా ఇళ్లు అందించాలన్నదే లక్ష్యమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పునాదులు వేసి వదిలేసిన ఇళ్లను దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పూర్తి చేస్తామని, గృహలక్ష్మి కింద రూ.3లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించి పెండింగ్‌లోని పనులన్నీ త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి

సాగు, అభివృద్ధిలోనూ ఉమ్మడి జిల్లా ఆదర్శం: మంత్రి కోమటిరెడ్డి

ఉద్యమాల్లోనే కాకుండా వ్యవసాయంలోనూ, అభివృద్ధిలోనూ ఉమ్మడి ఖమ్మంజిల్లా ఆదర్శవంతంగా నిలిచిందని రోడ్లుభవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రెండు జిల్లాల్లో ధాన్యాం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగించాయని, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి లాంటి కార్యక్రమాలను కూడా విజయవంతంగా చేయాలని కోరారు. రాష్ట్రం అనేక ఇబ్బందుల్లో ఉన్నా అభివృద్ధి, సంక్షేమంలో నిధులు ఇబ్బందులు లేకుండా కేటాయిస్తుందని, కిందిస్థాయిలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, అనర్హులకు పథకాలు అందకుండా చూడాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మేలు చేసే సీతారామప్రాజెక్టును కూడా త్వరలోనే పూర్తిచేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గంలోనూ యంగ్ ఇండియా కింద ఇంటర్‌నేషనల్ పాఠశాలలు నిర్మిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలని ఆదేశించారు. జిల్లాలో డెంగీ, మలేరియా లాంటి అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

● ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్‌వీపాటిల్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. జిల్లాలో వ్యవసాయసీజన్‌లో విత్తనాల సరఫరా నకిలీ విత్తనాలు అరికట్టేందుకు తీసుకునేందుకు చర్యలు వివరించారు. ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సక్రమంగా జరిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మిగిలిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన వారికి అవగాహన కల్పించాలన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేసుకునేవారికే తక్కువ ధరకు సామగ్రి ఇవ్వాలని కొత్తగూడెం ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని తెలిపారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఏజెన్సీ మండలాలుగా ఉన్న ఏన్కూరు, కారేపల్లి, కామేపల్లి మండలాలకు కూడా అదనపు ఇళ్లు ఐటీడీఏ ద్వారా మంజూరు చేయాలన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ గృహలక్ష్మి కింద పునాదులు నిర్మించిన వారిక ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేయాలని, సత్తుపల్లి నియోజకవర్గంలో ఆసపత్రుల్లో వైద్యుల కొరత ఉందని, తెలిపారు. ఈ సమీక్షలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగ్గూడెం జిల్లాల కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వీ పాటిల్, ఖమ్మం సీపీ సునిల్‌దత్, ఎస్పీ బి.రోహిత్‌రాజ్, డీఎఫ్‌వో సిద్దార్థ విక్రంసింగ్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ తదితరులున్నారు.

భద్రాద్రి కలెక్టర్‌కు మంత్రుల అభినందనలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచేలా తన సతీమణికి పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేయించిన భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్ ఆదర్శంగా నిలిచారంటూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి , కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభినందించారు. ఉమ్మడి జిల్లా సమీక్షకు హాజరైన కలెక్టర్ జితేష్ వీపాటిల్‌కు కుమారుడు జన్మించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారు.. ప్రభుత్వ ఆసుపత్రిలో తన సతీమణికి ప్రసవం చేయించడం అభిందనీయమని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా తమ వారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం సేవలు చేయించి.. ప్రజల్లో నమ్మకం కలిగించేలా చూడాలని సూచించారు

ఆదాయంతో పాటే వ్యయం..

(5వ పేజీ తరువాయి)

ఇన్వర్టర్ల నిర్వహణ, సామగ్రి కొనుగోలు ఇతరత్రా వాటి కోసం రూ.5.86లక్షలు వెచ్చిస్తోంది. దేవస్థానంలో భక్తుల వసతి కోసం కాటేజీలు, సత్రాల ద్వారా రూ.2.04 కోట్ల ఆదాయం సమకూరుతుండగా ఇందులో హౌస్ కీపింగ్ సిబ్బంది వేతనాలు, మెటీరియల్ కొనుగోళ్ల కోసం సుమారు రూ.కోటి వరకు ఖర్చవుతోంది.

జీతాలకే రూ.15 కోట్లు

భద్రాద్రి దేవస్థానంలో రెగ్యులర్, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులతో పాటు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు ఏడాదికి రూ.15కోట్లు జీతాల రూపేణ చెల్లించాల్సి ఉంటోంది. భద్రాద్రి దేవస్థానం రక్షణ, భద్రత చర్యలను చేపట్టే స్పెషల్ ప్రొటక్షన్‌ఫోర్సు(ఎస్‌పీఎఫ్)కు ఇక్కడ ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, తొమ్మిది కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఏటా రూ.1.50 కోట్లు పైనే జీతాల కోసం చెల్లిస్తున్నారు.

నిత్యాన్నదాన నిర్వహణకు రూ.2కోట్లపైనే

భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత నిత్యాన్నదాన పథకానికి ఏటా రూ.2కోట్లపైనే ఖర్చవుతున్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. సరుకులు, జీతాలు, గ్యాస్, ఇతరత్రా వాటి కోసం ఈ మొత్తాన్ని వెచ్చిస్తున్నట్లు పేర్కొంటున్నారు. అన్నదానం పథకం నిర్వహణ కోసం ఇప్పటి వరకు దేవస్థానం వివిధ బ్యాంకుల్లో రూ.39 కోట్లు ఫిక్సిడ్ డిపాజిట్లు చేసింది. వాటి మీద వచ్చే వడ్డీతోనే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అయితే గతేడాది రూ.3.75 కోట్లు ఫిక్సిడ్ డిపాజిట్లు చేయగా రూ.19.64కోట్లు తిరిగి బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు.

భక్తుల మన్ననలు పొందితే..

భద్రాద్రి దేవస్థానం భక్తుల మన్ననలు పొందితే మరింత ఆదాయాన్ని సమకూర్చుకుంటుందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అన్నదాన పథకానికి విరాళాలిచ్చే భక్తులకు వారు నిర్దేశించిన తేదీల్లో సమాచారాన్ని సంబంధిత దాతకు వాట్సప్ ఎస్ఎంఎస్‌ల రూపంలో సమాచారం ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు. అదే సమయంలో దర్శనానికి వచ్చిన భక్తుల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తే దేవస్థానానికి ఆదాయం పెరుగుతుందని భక్తులు సూచిస్తున్నారు. ప్రసాదాలు నాణ్యత మరింతగా పెంచి అన్ని రకాల ప్రసాదాలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

భూ సేకరణలో జాప్యం..

రోడ్డు పనులకు గండం

- 200మీటర్ల సేకరణలో సమస్యలు
- నిలిచిన సత్తుపల్లి - విజయవాడ రోడ్డు నిర్మాణం

సత్తుపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): భూసేకరణలో జరుగుతున్న జాప్యం.. సత్తుపల్లి నుంచి వేంసూరు మీదుగా విజయవాడ వెళ్లే ప్రధాన రహదారి పనులకు గండంగా మారింది. సింగరేణి ఓపెన్ కాస్టు బొగ్గు గని కారణంగా పాత రోడ్డును మూసి వేసి నాలుగున్నర కిలోమీటర్ల మేర మరో వైపు రోడ్డును నిర్మించాలని అధికారులు తలపెట్టారు. పనులు ప్రారంభమై మూ డేళ్లయినా ఇంత వరకూ రహదారి నిర్మానం పూర్తి అందుబాటులోకి రాలేదు. కేవలం 200 మీటర్ల మేర భూసేకరణ సమస్య వల్ల రహదారి నిర్మాణం పూర్తి కావడం లేదని తెలిసింది.

రూ.50కోట్లతో రహదారి నిర్మాణం

సత్తుపల్లి నుంచి వేంసూరు మీదుగా విజయవాడ రహదారిలో సింగరేణి ఓపెన్ కాస్టు బొగ్గు గని ప్రారంభమైంది. గని ప్రారంభానికి ముందు పాత రహదారి కొంత మేర బొగ్గుగనిలో కలిసిపోయింది. దాని స్థానంలో కొత్తూరును ఆనుకొని రేజర్ల వరకూ శాశ్వత రహదారిని నిర్మించాలని నిర్ణయించారు. ఈ రహదారి నాలుగు లైన్ల రహదారిని డివైడర్లతో నిర్మించేందుకు రూ.50కోట్లు మూడేళ్ల క్రితం మంజూరయ్యాయి. ఈ నిధులతో రహదారి పనులు అప్పట్లో ప్రారంభించారు. భూ సేకరణ కూడా పూర్తి చేసారు. ఈ రోడ్డునిర్మాణం పూర్తి అయ్యే వరకూ తాత్కాలికంగా మరో రోడ్డును నిర్మించారు. ప్రస్తుతం తాత్కాలిక రహదారిలోనే రాకపోకలు సాగుతున్నాయి.



మూడేళ్లుగా పూర్తి కాని రహదారి

నిధులు సిద్దంగా ఉన్నప్పటికీ రహదారి నిర్మాణం మాత్రం మూడేళ్ళుగా పూర్తి కావటం లేదు. మొత్తం నాలుగున్నర కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి గాను 2.3కిలో మీటర్ల పనులు పూర్తి అయ్యాయి. ఈ ప్రాంతంలలో మొత్తం భూ సేకరణ ప్రక్రియ పూర్తి అయింది. కాని పట్టణానికి సమీపంలోని కొందరు భూముల యజమానుల అభ్యంతరాలతో భూ సేకరణ నిలిచిపోయింది. కేవలం 200 మీటర్ల భూమికి సంబంధించి ఎకరాల్లో పరిహారం కాకుండా, గజాల్లో భూమికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. దీంతో ఏడాది కాలంగా భూసేకరణ, పరిహారం సమస్య పరిష్కారం కాకపోవటంతో పనులు నిలిచిపోయాయి. సమస్యను సింగరేణి అధికారులు జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసారని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. సమస్య పరిష్కారం అయిన వెంటనే పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

రాష్ట్రానికి రానున్న నలుగురు కొత్త ఐఏఎస్‌లు

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): 'సివిల్ సర్వీసెస్ పరీక్ష-2024' ద్వారా ఎంపికైన నలుగురు కొత్త ఐఏఎస్ అధికారులు రాష్ట్రానికి రానున్నారు. తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఖాళీలను భర్తీ చేయడానికి మొత్తం 180 మంది ఐఏఎస్‌లను ఆయా రాష్ట్రాలకు కేటాయిస్తున్నట్లు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ(డీవోపీటీ) వెల్లడించింది. రాష్ట్రానికి రానున్న నలుగురిలో ఇద్దరు సొంత రాష్ట్రం తెలంగాణకు చెందిన వారు కాగా... మిగతా ఇద్దరు ఇతర రాష్ట్రాలకు చెందినవారని తెలిపింది. అలాగే ఇద్దరు ఐఏఎస్‌లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు చెందినవారు కాగా, మరో ఇద్దరు ఇతర వెనుకబడిన వర్గాల(ఓబీసీ)కు చెందినవారు ఉంటారని డీవోపీటీ పేర్కొంది.

విస్తరణలో మాదిగలకు స్థానం కల్పించాలి

» అధిష్ఠానానికి విజ్ఞప్తి చేయనున్న ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ, మే 29 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని ఆ వర్గానికి చెందిన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఢిల్లీ చేరుకున్నారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు మందుల సామ్యూల్, కవ్వంపల్లి సత్యానారాయణ, అడ్లూరి లక్ష్మణ్, తోట లక్ష్మీకాంతరావు మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్, మీనాక్షి నటరాజన్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. ఇప్పుడు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు చెప్పాలని ఢిల్లీకి వచ్చామని తెలిపారు. రాష్ట్ర జనాభాలో దాదాపు 60 లక్షలు వరకు ఉన్న తమకు క్యాబినేట్‌లో ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమని చెప్పారు.

మంత్రిపై అసభ్య పోస్టు .. బీఆర్ఎస్ నేత అరెస్ట్

కాటారం, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబుపై సోషల్‌మీడియాలో అభ్యంతరకర పోస్టు పెట్టిన కాటారం బీఆర్ఎస్ నాయకుడు జక్కు శ్రావణ్‌ను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపూర్‌లో బంధువుల ఇంట్లో ఉన్న శ్రావణ్‌ను గురువారం తెల్లవారుజామున పోలీసులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఎలాంటి సమాచారం లేదని స్థానిక పోలీసులు తెలిపారు. మరోవైపు శ్రావణ్‌ను నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా కోర్టు బెయిల్ మంజూరు చేసిందని బీఆర్ఎస్ నేతలు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

» భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 80 మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని ఇందులో ఆర్థిక ఇబ్బందుల కారణంగా 60 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.



సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కలిసిన తెలంగాణ కేడర్‌కు కేటాయించిన 2024 బ్యాచ్ ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం

రేపే మిస్ వరల్డ్-2025 ఫైనల్

హైటెక్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా వేదిక .. మల్టీ మీడియా చాలెంజ్‌లో విజేతలుగా నలుగురు

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): గత మూడు వారాలుగా కొనసాగుతున్న ప్రపంచ అందాల పోటీలు తుది దశకు చేరుకున్నాయి. శనివారం సాయంత్రం మిస్ వరల్డ్-2025 ఫైనల్ కోసం నగరం సిద్ధమైంది. సాయంత్రం 6 గంటల నుంచి హైటెక్స్‌లో జరగనున్న ఈ పోటీల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. విదేశాల నుంచి వచ్చిన ప్రత్యేక డిజైనర్లు ప్రధాన వేదికను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. శనివారం వేడుకల్లో భాగంగా.. బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండేజ్, ఇషాన్ ఖట్టర్‌తో పాటు పలువురు నటులు నృత్యప్రదర్శన ఇవ్వనున్నారు. ఫైనల్ పోటీల్లో న్యాయనిర్ణేతలుగా ప్రముఖ నటుడు సోనూ సూద్, మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ డైరెక్టర్ సుధారెడ్డి, 2017 మిస్ వరల్డ్ విజేత మానుషి చిల్లర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. కాగా.. ఏటా మిస్ వరల్డ్ ఫైనల్లో ఇచ్చే మానవతావాది (హ్యూమానిటేరియన్) పురస్కారాన్ని ఈసారి సోనూసూద్‌కు ఇవ్వనున్నారు. అలాగే రెండు రోజుల క్రితం నిర్వహించిన 'మల్టీమీడియా చాలెంజ్' విజేతలను మిస్ వరల్డ్ సంస్థ గురువారం రాత్రి ప్రకటించింది. ఇందులో నాలుగు ఖండాల నుంచి నలుగురు విజేతలున్నారు. ఏషియా-ఓషియానా నుంచి థాయ్‌లాండ్, యూరప్ నుంచి మాంటీనెగ్రో, ఆఫ్రికా నుంచి కామెరూన్, అమెరికా-కరేబియన్ నుంచి డొమినికన్ రిపబ్లిక్ దేశాల ప్రతినిధులు ఇందులో విజేతలుగా నిలిచారు. దీంతో ఫైనల్‌లో టాప్-40లో వీరి స్థానం ఖరారైంది.



'మల్టీమీడియా చాలెంజ్' విజేతలు మిస్ థాయ్‌లాండ్, మిస్ కామెరూన్, మిస్ డొమినికన్ రిపబ్లిక్, మిస్ మాంటెనెగ్రో

'మిస్ వరల్డ్'కు రూ.300 కోట్లా..?

» మహిళా హక్కుల ఉద్యమకారుల ధ్వజం

హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): 'ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం దగ్గర పైసల్లేవ్.. కానీ, మిస్ వరల్డ్ అందాల పోటీలకు మాత్రం రూ.300 కోట్లు ఖర్చుపెడతారా?'అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మహిళా హక్కుల ఉద్యమకారులు మండిపడ్డారు. మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మిస్ వరల్డ్ పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీకి ఆయా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. శనివారం జరిగే మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలేను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పదోవంతు డిగ్రీ కాలేజీల్లో సున్నా ప్రవేశాలు

ఒక్కరూ చేరని కాలేజీలు 74 .. 60,436 మందికి ప్రవేశాలు ఖరారు..దోస్త్ తొలి విడత జాబితా విడుదల



హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పదోవంతు డిగ్రీ కాలేజీల్లో ఒక్క విద్యార్థి కూడా అడ్మిషన్ తీసుకోలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26)లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన దోస్త్-2025 తొలి విడత అడ్మిషన్లలో రాష్ట్రంలోని 805 కాలేజీల్లో 74 కాలేజీల్లో ఒక్కరూ అడ్మిషన్‌కు వెబ్ ఆప్షన్ ఇవ్వలేదు. అందులో రాజన్న-సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కూడా ఉంది. గతేడాది మాదిరే ఈసారి యూజీ డిగ్రీలో 36శాతం (21,758 మంది) కామర్స్ కోర్సులు ఎంచుకోగా, తర్వాతి స్థానాల్లో ఫిజికల్ సైన్సెస్ 15,249 మంది, లైఫ్ సైన్సెస్ 11,005 మంది, ఆర్ట్స్ 5,986 మంది, ఇతర కోర్సులు 6,438 మంది ఎంచుకున్నారు. 58,575 మంది ఇంగ్లీష్ మాధ్యమం, 1,552 మంది తెలుగు, 309 మంది హిందీ మాధ్యమం ఎంచుకున్నారు. తొలి జాబితాలో సీట్లు విద్యార్థినులే అధికసీట్లు పొందారు. ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో 89,572 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా 65,191 మంది వెబ్ ఆప్షన్లు సమర్పించారు. వారిలో 60,436 మంది సీట్లు లభించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 805 డిగ్రీ కాలేజీల్లో 3,71,096 సీట్లు ఉన్నాయి. దోస్త్ తొలి విడుత అడ్మిషన్ల జాబితాను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, ఉపాధ్యక్షులు ఈ.పురుషోత్తం, ఎస్‌కె. మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు గురువారం విడుదల చేశారు. తొలి జాబితాలో సీట్లు లభించిన వారు ఈ నెల 30 నుంచి జూన్ ఆరో తేదీ వరకూ నిర్దిష్ట ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, లేకపోతే సీటు రద్దవుతుందని బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ నెల 30 నుంచి జూన్ 9వరకూ దోస్త్ రెండో విడత దరఖాస్తులను స్వీకరిస్తామని, 13న సీట్లు కేటాయిస్తామన్నారు.

సీట్ల భర్తీలో నిజాం కాలేజీ టాప్

హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ 1,197 సీట్లకు 1,170 (97.74%) సీట్ల భర్తీతో మొదటి స్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో కోఠి మహిళా కాలేజీ (వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం)లో 93.19%, మూడో స్థానంలో ఉన్న సిటీ కాలేజీలో 88.89, బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 82.69, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 80.98, నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌రాం డిగ్రీ కాలేజీలో 80.29, కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కాలేజీలో 73.01, నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కాలేజీలో 68.56, హన్మకొండలోని యునివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో 66.1, నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీలో 65.75% సీట్లు భర్తీ అయ్యాయి. ఈసారి దోస్త్‌లో 10 మంది టాప్ ర్యాంకర్లలో నలుగురు కోఠి మహిళా కాలేజీని ఎంచుకున్నారు. వారిలో ముగ్గురు ఫిజికల్ సైన్సెస్, ఒకరు లైఫ్ సైన్స్ సబ్జెక్ట్ ఆప్ట్ చేసుకున్నారు. ఇంటర్‌లో 99.60% మార్కులతో దోస్త్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు పొందిన వసంత్ కుమార్, 99.40% మార్కులతో ఎనిమిదో ర్యాంకు పొందిన బెక్కరి అక్షిత కూడా నిజాం కాలేజీలో కామర్స్ విభాగంలో సీటు పొందారు.

75% హాజరుతోనే ఫీజు రీయింబర్స్‌మెంట్

డిగ్రీ కోర్సుల్లో కనీసం 75% తరగతులకు హాజరైన విద్యార్థులకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని గురువారం జరిగిన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ల సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. మరోవైపు, మూడేళ్ల డిగ్రీ కోర్సులో ఆరు సెమిస్టర్లలో ప్రతి సెమిస్టర్‌కు 25 క్రెడిట్స్ చొప్పున 150 క్రెడిట్స్ ఉండగా, వాటిని 142కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. చివరి సంవత్సరం రెండు సెమిస్టర్లలో ఒక మైనర్ సబ్జెక్ట్, ప్రథమ/ద్వితీయభాషలకు కలిపి 15 చొప్పున 30 క్రెడిట్స్ తొలగించారు. ఐదో సెమిస్టర్‌లో మల్టీ డిసిప్లినరీ కోర్సు 4, అదనంగా నేర్చుకునే ఇతర కోర్సులకు 7 క్రెడిట్స్, చివరి సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్‌కు 4, ఇతర అదనపు కోర్సులకు 7 క్రెడిట్స్ కేటాయించారు. చివరి రెండు సెమిస్టర్లలో విద్యార్థులు రెండు ప్రధాన సబ్జెక్టులపై దృష్టి సారించాలని, ఇంటర్న్‌షిప్‌తోపాటు అదనపు కోర్సులు నేర్చుకోవాలన్న లక్ష్యంతో కొత్త క్రెడిట్స్ విధానం రూపొందించామని బాలకిష్టారెడ్డి తెలిపారు.

భవనంపై నుంచి దూకి బీఆర్ఎస్ నేత ఆత్మహత్య

మాజీ డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ వేధింపుల వల్లేనంటూ బంధువుల ఆందోళన

బోరబండ ప్రాంతంలో ఉద్రిక్తత



ఎండీ సర్దార్ (ఫైల్)

బోరబండ, మే 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బోరబండ డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ సర్దార్ (33) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులే సర్దార్ ఆత్మహత్యకు కారణమంటూ ఆయన బంధువులు గురువారం ఆందోళనకు దిగారు. దీనితో బోరబండ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఎండీ సర్దార్ ఎస్ఆర్‌టీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి తన ఇంటి నాలుగో అంతస్తు నుంచి కిందికి దూకారు. రక్తపు మడుగులో పడి ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించినా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు గుర్తించారు. బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులతోనే సర్దార్ ఆత్మహత్యకు పాల్పడ్డారంటూ బంధువులు, బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బోరబండ ప్రాంతంలో, ఫసియుద్దీన్ నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్దార్ సోదరుడు ఇబ్రహీం ఫిర్యాదు మేరకు ఫసియుద్దీన్, ఆయన భార్య హబీబాషేక్, పీఏ సప్తగిరితోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తన సోదరుడు ఇటీవల ఇంటి ఆధునీకరణ పనులు చేపట్టారని.. దీనితో డబ్బులు డిమాండ్ చేస్తూ వారు వేధించారని ఇబ్రహీం ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వేధింపులు తట్టుకోలేక సర్దార్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. సర్దార్ మృతదేహాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రంగంలోకి టాస్క్‌ఫోర్స్!

» నకిలీ విత్తన నియంత్రణపై ఫోకస్
» తనిఖీలు చేస్తున్న అధికారులు
» ఖమ్మం అర్బన్ మండలంలో విత్తన దుకాణాల్లో రికార్డుల పరిశీలన

ఖమ్మం వ్యవసాయం, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులను నట్టేట ముంచుతున్న నకిలీ విత్తనాల నియంత్రణపై ఉక్కుపాదం మోపేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే టాస్క్‌ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగాయి. నకిలీ విత్తన ముఠాలు, విక్రయిస్తున్న దుకాణాలపై పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు నజర్ పెట్టారు. ప్రధానంగా నకిలీ పత్తి విత్తనాలు విక్రయించకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్న తరుణంలో ఖమ్మం జిల్లాలోకి నాసిరకం విత్తన ముఠాల ఏజెంట్లు వస్తున్నారు. తక్కువ ధరను ఆశగా చూపి ఊరుపేరు లేని నాసిరకం విత్తనాలు అంటగట్టే ముఠాలు, వ్యాపారుల పని పట్టేందుకు అధికారులు వ్యూహాలు సిద్ధం చేశారు. వ్యవసాయ, పోలీస్ అధికారులతో కలిసి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి..

ఖమ్మం జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ పత్తి విత్తనాలు దిగుమతి అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఏపీ, మహారాష్ట్ర నుంచి నకిలీ విత్తనాలు జిల్లాకు చేరుకుంటున్నట్టు సమాచారం. ఆయా ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు కొత్తకొత్త పేర్లు, కంపెనీలతో నకిలీ విత్తనాలను జిల్లాకు తీసుకొచ్చి డీలర్ల ద్వారా విక్రయించేందుకు ప్రయత్నిస్తునట్టు తెలుస్తోంది.

దుకాణాల్లో తనిఖీలు..

సాగు సీజన్ ఊపందుకోనున్న నేపథ్యంలో తనిఖీలు ముమ్మరంగా చేయాలని అధికారులు నిర్ణయించారు. వరుసగా మూడు సార్లకంటే ఎక్కువగా పట్టుబడిన నిందితులపై పీడీ యాక్టు ప్రయోగించడానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు రైతులలో నాసిరకం విత్తనాలు కొనుగోలు చేయకుండా అవగాహన కల్పిస్తున్నారు. విత్తన కొనుగోలు సమయంలో లేబుళ్ల సక్రమంగా ఉండేలా, అధికారిక డీలర్ వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా నకిలీవి విక్రయించే అవకాశం ఉన్న బీజీ-3 పత్తి విత్తనాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెడుతున్నారు. ఈ క్రమంలోనే ఖమ్మం అర్బన్ మండలంలో గురువారం విత్తన టాస్క్‌ఫోర్స్ అధికారులు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఖమ్మం రెగ్యులర్ ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, త్రీటౌన్‌సీఐ జె.మోహన్‌బాబు, అర్బన్ ఎంఏవో బలుసు కిషోర్ బాబు, తనిఖీల్లో పాల్గొన్నారు. విత్తన ప్యాకెట్లపై లేబుళ్ల, లాట్ నెంబర్లు, తయారీ తేదీ, గడువుతేదీ, ఇన్వాయిస్, సోర్స్ సర్టిఫికెట్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు విధిగా బిలుల్లు ఇవ్వాలని వివరాలను పూర్తిగా రాయాలని సూచించారు. బీటీ-3 పత్తి విత్తనాలపై ఆరా తీశారు.



అర్బన్ మండలంలో విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఏన్కూరు మండలంలో 390 ప్యాకెట్లు లభ్యం?

ఖమ్మం, మే 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) / ఏన్కూరు (ఆంధ్రజ్యోతి) : వర్షాలు పడటం, వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతోనే ఉమ్మడి ఖమ్మంజిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు ప్రత్యక్షమవుతున్నాయి. ఏపీకి సరిహద్దున ఉన్న జిల్లా కావడంతో అక్కడి నుంచే ఎక్కువగా నకిలీ విత్తనాలు వస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఏపీలోని గుంటూరు తదితర ప్రాంతాలనుంచి దొంగచాటుగా వచ్చిన పత్తి విత్తనాలను ఏన్కూరు పోలీసులు గురువారం పట్టుకున్నట్టు తెలుస్తోంది. ఏన్కూరు మండలం హిమాంనగర్‌లో సుమారు 390ప్యాకెట్లు లభ్యమైనట్టు సమాచారం కాగా.. ఏన్కూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఇప్పటికే ఈ అనుమతిలేని విత్తనాలను రైతులకు విక్రయించారన్న సమాచారంతో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. ఇక గురువారం ఖమ్మంలో జరిగిన ఉమ్మడి ఖమ్మంజిల్లా సమీక్షా సమావేశంలో ఈ విషయాన్ని ఖమ్మం సీపీ సునిల్ దత్ మంత్రులకు తెలియజేశారు.

కఠిన కేసులు పెట్టాలని మంత్రుల ఆదేశం

దీంతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందిస్తూ నకిలి విత్తన విక్రయదారులపై కఠిన కేసులు పెట్టాలని, అన్ని సెక్షన్లు పెట్టాలని, మళ్లీ నకిలీ విత్తనాలు అమ్మాలంటే భయపడేలా పీడీయాక్ట్ కేసులు నమోదుచేయాలని ఆదేశించారు. ఇదే సమయంలో జిల్లాలో పత్తిసాగు చేసే పలు మండలాల్లో కూడా టాస్కుఫోర్సు బృందాలు తనిఖీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో పట్టుబడిన నకిలీ విత్తనాల వివరాలను నేడోరేపో పోలీసులు అధికారికంగా వెల్లడించనున్నట్టు తెలుస్తోంది.

ఇదీ టాస్క్‌ఫోర్స్ టీం...

నకిలీ విత్తనాలను గుర్తించడంతో పాటు విత్తన ముఠాలపై చర్యలు తీసుకోవాడానికి టాస్క్‌ఫోర్స్ టీంలో వ్యవసాయ శాఖ అధికారులు, విత్తన సర్టిఫికేషన్ అధికారులు, సీడ్ కార్పొరేషన్ అధికారులు, పోలీసులు భాగస్వాములుగా ఉన్నారు.

ఓ యంత్రం.. 30రకాల సాగు పనులు

» మంత్రి తుమ్మల వ్యవసాయ క్షేత్రంలో ఫార్మ్ యంత్ర ప్రదర్శన
» రిమోట్ కంట్రోల్‌తో సుమారు 30రకాల సాగు పనులు
» తక్కువ ఖర్చుతో, స్వయంగా ఆపరేట్ చేసుకునే అవకాశం



వివరాలు తెలుసుకుంటున్న తుమ్మల యుగంధర్

అశ్వారావుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ఎన్నో సాంకేతిక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. యాంత్రీకరణతో చాలా పనులు సులువుగా అయిపోతున్నాయి. ఈ క్రమంలోనే ఫార్మ్‌రోబో పేరుతో వచ్చిన ఓ యంత్రం ఆ పనులను మరింత సులువు చేసింది. చూడటానికి చిన్నపాటి జీపును పోలి ఉన్న ఈ యంత్రంతో భద్రాద్రికొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి సమీపంలోని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో గురువారం ప్రదర్శించారు. ఆర్1 ఫార్మ్ రోబో అనే కంపెనీకి చెందిన ఈ ఫార్మ్ రోబో యంత్రంతో వ్యవసాయ పనులు ఏ విధంగా చేయించవచ్చో చూపించారు. రిమోట్ కంట్రోల్‌తో దాదాపు 700 మీటర్ల దూరం నుంచే రైతులే స్వయంగా ఆపరేట్ చేసుకునేలా దీన్ని రూపొందించారు. మామిడి, నిమ్మ, అరటి, జామ, సపోట లాంటి ఉద్యాన పంటలు, కంది, మిర్చి, టమాట, వంగ, తీగజాతి పంటలు, కరివేపాకు, పూల తోటలు, పొగాకు, ఆముదం, అల్లం, పసుపు, ఎర్ర చందనం, యూకలిప్టస్, మలబార్ వేప లాంటి క్షేత్రాల్లో సాళ్ల మధ్యన ఉండే కలుపు గడ్డిని కట్ చేయడం, పూర్తిగా తొలగించడం, రొటోవేటర్ తరహాలో దున్నడం, సాళ్ల మధ్య తిరుగుతూ క్రిమిసంహారక మందులు పిచికారీ చేయడం లాంటి దాదాపు 30రకాల పనులను ఈ యంత్రం ద్వారా చేయవచ్చునని ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం మాన్యువల్‌గా రిమోట్‌తో ఆపరేట్ చేస్తున్నప్పటికీ.. భవిష్యత్‌లో ప్రోగ్రామింగ్ సెట్ చేయడం ద్వారా నేరుగా నిర్దేశించిన వ్యవసాయ పనులను దానికదే చేసేలా తీర్చిదిద్దుతున్నట్టు వివరించారు. దాదాపు రూ.4లక్షల విలువ చేసే ఈ యంత్రం ద్వారా వ్యవసాయ పనులను అతి తక్కువ ఖర్చుతో, సులభంగా, కూలీల ఖర్చు, కొరత లాంటి ఇబ్బందులేమీ లేకుండా రైతులే స్వయంగా చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ ఆ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి యంత్రం సామర్థ్యం, ఎన్ని రకాల పనులకు ఉపయోగించుకోవచ్చు, ఖర్చు ఎంతవుతుంది, రైతులకు ఏ విధంగా లాభసాటిగా ఉంటుందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.



తోటలో మందును పిచికారీ చేస్తున్న యంత్రం

నాటి ఎన్టీఆర్ పథకాలు చిరస్మరణీయం

» ఆయన జన్మ ఒక అద్భుతం..
» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
» దమ్మపేటలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

దమ్మపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : నాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చిరస్మరణీయమని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ కూడా వాటిని పక్కన పెట్టే ధైర్యం చేయలేకపోయాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. దమ్మపేటలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భం గా మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లుతో పాటు పలువురు నేతలు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. అ ట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ నాడు ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి నిరంతరం పాటుపడిన గొప్ప నేతగా, పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన మహనీయుడిగా గుండెల్లో నిలిచిపోయారన్నా రు. ఎన్టీఆర్ జీవితం ఒక అద్భుతమని, ఆదర్శవంతమైందని, ఆయన రాజకీయవాది కాదని మానవతామూర్తి అని కొనియాడారు. ప్రస్తుతం ఏపార్టీలో చూసినా ఆయన తీర్చిదిద్దిన నాయకులే ఉన్నారని అన్నారు. ఆయన ఆశయాలకు తగ్గట్టుగా పనిచేశాం కాబట్టే 43ఏళ్లుగా రాజకీయాల్లో ఎన్‌టీఆర్ బిడ్డలుగా ఉన్నామన్నారు. ప్రపంచమే మెచ్చిన నాయకుడు ఎన్‌టీఆర్ అని అన్నారు. ఇక ఈఏడాది సత్తుపల్లి నియోజకవర్గానికి, వచ్చే ఏడాదికి అశ్వారావుపేట నియోజకవర్గానికి గోదావరి జలాలు అందుతాయని, సీతారామతో పంటలు పండటంతో పాటు ఈప్రాంతంలో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. అశ్వారావుపేట మండలంలోని పెదవాగుప్రాజెక్టుకు తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.19 కోట్లు కేటాయించామని, వచ్చే ఏడాది రూ.32కోట్లతో పూర్తిస్థాయి ఆధునికీకరణ చేపడతామన్నారు. ఇందుకు ఏపీ సీఎం చంద్రబాబునాయుడుతో మాట్లాడి ఒప్పించామన్నారు. వెంకమ్మ చెరువు వరద కాలువ పనులకు త్వరలోనే నిధులు మంజూరు చేస్తామన్నారు. చంద్రుగొండ మండలంలోని వెంగళరావుసాగర్ మరమ్మతులకు రూ.33కోట్లు కేటాయించామని వివరించారు. మారుమూల కొండరెడ్ల గ్రామం పూసుకుంటకు రూ.32కోట్లు వెచ్చించి వంతెనలు, రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఆలపాటి రామచంద్రప్రసాద్, గడ్డిపాటి సత్యం, కట్రం స్వామిదొర, పైడి వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, రాజేశ్వరరావు, ఎల్లిన రాఘవరావు, మొగళ్లపు చెన్నకేశవరావు, బండి భాస్కర్, కొయ్యల అచ్యుతరావు, రావు గంగాధర్‌రావు, వలీపాషా, కేవీ సత్యనారాయణ, ప్రసాద్, నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు, పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నమస్కరిస్తున్న మంత్రి తుమ్మల



నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

తిరుమలాయపాలెం, మే29(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకంటామని ఎస్‌ఐ జగదీష్ తెలిపారు. గురువారం రైతువేదికలో విత్తన డీలర్లు, పురుగుమందుల యజమానులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పురుగుమందులు మాత్రమే అమ్మాలని, నకిలీ ఎరువుల, విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మాలన్నారు. ఈకార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, ఏఈవో బాలకృష్ణ, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న కళావతిబాయి

నూరుశాతం వ్యాక్సినేషన్ జరగాలి

- జిల్లా వైద్యాధికారి కళావతిబాయి
- రొటా వైరస్‌పై వర్క్ షాప్

ఖమ్మంకలెక్టరేట్, మే29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్నిమండలాల్లోనూ నూరుశాతం వ్యాక్సినేషన్ కార్యక్రమం పూర్తవ్వాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కళావతిబాయి అన్నారు. గురువారం భక్తరామదాసు కళాక్షేత్రంలో మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, ఏఎన్‌ఎంలకు 'రొటా వైరస్, ఇతర వ్యాక్సిన్‌లపై రీ - ఓరియేంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈశిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో మాటాడుతూ జిల్లాలో ఇప్పటికే 97 శాతం వ్యాక్సిన్‌ను గుర్తించిన పిల్లలకు వేస్తున్నట్లు చెప్పారు. నూరుశాతం వ్యాక్సిన్ వేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. వైద్యసిబ్బంది వేస్తున్న వ్యాక్సిన్ గురించి ఏఎన్‌ఎం, సూపర్వైజర్లు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాక్సిన్ వేయడం వలన 8 రకాలైన ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి పిల్లలను రక్షించుకోవచ్చని తెలిపారు. వ్యాక్సిన్ వేసిన రోజు కొందరు పిల్లలకు ఆబ్సెస్ అవుతుందని, కొద్దిగా జ్వరం కూడా వస్తుందని, అంతమాత్రాన భయపడవద్దని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించాలన్నారు. చల్లనినీటిలో ముంచిన గుడ్డను ఆబ్సెస్ ఐన వద్ద అద్దాలని, పారాసెటమాల్ సిరప్ దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్మ్యూనైజేషన్ అధికారి చందునాయక్, డబ్ల్యూహెచ్‌ఓ. రాష్ట్ర శిక్షకుడు డాక్టర్. మురహరి, రోటావైరస్ వ్యాక్సిన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ప్రోగ్రాంఆఫీసర్ డాక్టర్ రామారావు, డెమో సుబ్రహ్మణ్యం, డీపీహెచ్‌ఎన్‌ఓ శేషరత్నం, డీవీఎల్‌ఎం. రమణ, మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఖమ్మంఖానాపురంహవేలి,మే29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మండిపో పరిధిలో ఆర్టీసీ బస్సులకు సంబంధించిన సమస్యలు, సలహాల కోసం శుక్రవారం సాయంత్రం4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ దినేష్‌కుమార్ తెలిపారు. 9959225958కు ఫోన్ చేసి సమస్యలను, సలహాలను సూచించాలని తెలిపారు.

కాంగ్రెస్ నేత హఠాన్మరణం



ఉపేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం, మే29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజారం గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ నాయకుడు మద్ది ఉపేందర్‌రెడ్డి (68) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. గతంలో సర్పంచ్‌గా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడినప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేశారు. భౌతికకాయాన్ని జిల్లాకాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ వనవాసం నరేందర్ రెడ్డి, గండ్ర గోపాలరావు నివాళులర్పించారు. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.ఉపేందర్‌రెడ్డి అకాలమరణం పట్ల మంత్రి పొంగులేటి సంతాపం తెలిపారు. గత ఎన్నికల్లో తన గెలుపుకోసం నిరంతరం శ్రమించారన్నారు. మంచి నాయకుడిని కోల్పోవడం దురదృష్టకరమన్నారు.

మహిళా మార్ట్ భేష్

- ఉత్పత్తులను పరిశీలించి కొనుగోలు చేసిన ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు
- మహిళా మార్ట్ లక్ష్యాన్ని వివరించిన ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మహిళా మార్ట్‌లో వస్తువులను కొనుగోలు చేస్తున్న ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 29(ఆంధ్రజ్యోతి): మహిళా ఉత్పత్తులు ఒకే ప్రాంతంలో అన్ని రోజులు ప్రజలకు అందుబాటులో ఉంచటం ఇందుకోసం మహిళా మార్టును రాష్ట్రంలోనే తొలిసారిగా ఖమ్మంలో ఏర్పాటు చేయడం భేష్‌గా ఉందని ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు కితాబునిచ్చారు. ఖమ్మం మహిళా మార్టును గురువారం ఉమ్మ డి ఖమ్మం జిల్లా కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి పాటిల్, సీపీ సునిల్‌దత్, ఎస్పీ రోహిత్‌రాజ్, జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్ పరిశీలించారు. మార్టు నిర్వహణపై సిబ్బందితో మాట్లాడారు. వ్యాక్యూమ్ విధానం ద్వారా సరుకులు, పదార్థాలు ప్యాకింగ్ విధానాన్ని పరిశీలించి అభినందించారు. మహిళా మార్టులో ప్రతి వస్తువును, మహిళా చేతి అల్లికలు, నేత చీరలు, బొమ్మలు, ఇతర వస్తువులను పరిశీలించారు. ఆదేసమయంలో మహిళా మార్టుకు ఖమ్మంలోని స్నేహ సమైఖ్య పరిధిలోని, శ్రీ విద్యా మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులు వెంకట మంజుల, నళిని చేతితో చేసిన ఆర్గానిక్ పచ్చి అగరబత్తిలు, డ్రై అగరబత్తీలు, దుప్‌స్టిక్స్, కోన్స్, పూజ సామాగ్రి ఇతర నూనే దీపాల ఉత్పత్తులను తీసుకువచ్చారు. వారి ఉత్పత్తులను ఉమ్మడి జిల్లా కలెక్టర్లు పరిశీలించారు. ఎంతకాలం నుంచి ఉత్పత్తులు తయారు చేస్తున్నారు.. ఏలా మార్కెటింగ్ చేస్తున్నారు.. అని ప్రశ్నించారు. ఇప్పుడు స్థానికంగా మహిళా మార్టు అందుబాటులోకి రావడంతో ఎటువంటి ప్రయోజనం ఉంటుందని నేరుగా సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. దీంతో స్పందించిన సభ్యులు మెప్మా ద్వారా శిక్షణ తీసుకున్నామని, తర్వాత ఉత్పత్తులు నాణ్యంగా తయారు చేస్తున్నామన్నారు. మహిళా మార్టు ద్వారా సమయం ఆదా అవుతుందని, అమ్మకాలు పెరుగుతాయని సంతోషం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ విధానం అమలులోకి తీసుకురావడంతో దేశ విదేశాల వారికి ఖమ్మం మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు అందుతాయన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ మహిళా మార్టు రూపొందించిన విధానాన్ని వివరించారు. ఖమ్మం మహిళా స్వయం సహాయక సంఘాల బ్రాండ్‌ను దేశ వ్యాప్తంగా ప్రత్యేకంగా గుర్తించేలా రూపొందించామన్నారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకొని దేశంలోని ఏ ప్రాంతానికైనా మహిళా మార్టు నుంచి మహిళా ఉత్పత్తులను పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్లకు వివరించారు. ప్రజలకు కల్తీ లేని నాణ్యమైన వస్తువులతో పాటుగా తక్కువ ధరలకే వినియోగదారులకు అందుబాటులో ఉంటాయన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా మహిళా స్వయం సహాయక సంఘాలు నేరుగా అమ్మకాలు జరుపుతున్నారని తెలిపారు. అనంతరం ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు మహిళా మార్టులోని టీ షాప్‌లో టీ తాగి నిర్వహకురాలిని అభినందించారు. డీఆర్‌డీఏ ఉద్యోగులు గాలయ్య, నెల్లూరి అనూప్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పలు రోడ్ల విస్తరణ

- నెరవేరుతున్న ప్రజల దశాబ్దాల కల
- విస్తరణకు సహకరిస్తున్న వ్యాపారులు
- షాపింగ్‌మాల్స్‌కు మార్గం సుగమం





రైల్వే స్టేషన్ వరకు రోడ్డు, బ్రాహ్మణ బజార్ నుంచి విస్తరణ పనులు

ఖమ్మంసంక్షేమవిభాగం,మే29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే వేగంగా అభివృద్ధి చెందే పట్టణాల్లో నగరం ముందు వరసలో ఉంటుంది. రెండు రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న నగరం కావటంతో ఇరు రాష్ట్రాల వ్యాపారులతో పాటుగా గుజరాత్, ఇతర రాష్ట్రాల వ్యాపారులు ఖమ్మంలో ప్రశాంతంగా వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఖమ్మం నగరంలోని ప్రధానమైన అంతర్గత కమర్షియల్ రహదారులు ఇరుకుగా మారాయి. ప్రజలు రవాణాకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా కమర్షియల్ వీధుల్లో వాహనాలతో వెళ్లాలంటే ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. రిక్కాబజార్‌రోడ్డు గతంలో 20 అడుగులకే పరిమితమై ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో రిక్కాబజార్, అంబభవాని రోడ్డును చర్చికాంపౌండ్ వరకు గతనెలలో విస్తరణ జరిగింది. 33అడుగుల వెడల్పు చేశారు. డ్రెయినేజీ నిర్మాణం జరుగుతుంది. ఇప్పుడు ఖమ్మం పాతమున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. కేవలం 20అడుగులు వెడల్పు మాత్రమే ఉన్న రహదారిని భవిష్యత్ ప్రజల రవాణా అవసరాల దృష్ట్యా మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల విస్తరణ విస్తరణ జరుగుతుంది. ఇంకా వీటితో పాటుగా ఖమ్మం రవాణాశాఖ కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు వరకు రహదారి విస్తరణ పనులకు పట్టణ ప్రణాళిక అధికారులు మార్కింగ్ చేశారు. వీటితో పాటుగా గాంధీ చౌక్ ప్రాంతంలోని పొట్టి శ్రీరాములు రోడ్డు, వీవీసీ షోరూం నుంచి చెర్వు బజార్ రోడ్డు కూడా విస్తరణ జరగబోతున్నాయి.

స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న వ్యాపారులు

వ్యాపార విధానాల్లో జరిగిన ఆధునిక మార్పులతో కమర్షియల్ వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. షాపింగ్ మాల్స్ ఉన్న ప్రాంతాలకు అధికంగా ప్రజలు కొనుగోలుకు వెళ్లటంతో రహదారుల విస్తరణ జరిగితే భవిష్యత్‌లో కమర్షియల్ వ్యాపారాలు బాగుంటాయని చాలామంది వ్యాపారులు భావిస్తున్నారు. దశాబ్దాల విస్తరణ కోరిక నేరవేరుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు తొత్తులుగా అధికారులు

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం



మాట్లాడుతున్న బ్రహ్మయ్య

నేలకొండపల్లి, మే29 (ఆంధ్రజ్యోతి): అధికారులు కాంగ్రెస్ తొత్తులుగా మారారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య ఆరోపించారు. త్వరలో జరుగనున్న బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవటానికి వీలుగా కొత్తకొత్తూరులో బీఆర్‌ఎస్ నిర్మిస్తున్న జెండా దిమ్మెను కూల్చటానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తూ గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కొత్తకొత్తూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య మాట్లాడుతూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఖమ్మం నుంచి కోదాడ వరకు రోడ్ల పక్కన ఉన్న అన్ని దిమ్మెలతో పాటుగా వ్యక్తిగతంగా ఉన్న ఆక్రమణలను సైతం తొలగించాలని అధికారులను కోరారు. ఇందిరమ్మఇళ్ళ మంజూరులో అనర్హులే ఉన్నారన్నారు. వీటన్నింటినీ కప్పి పుచ్చుకోవటానికే కాంగ్రెస్ వాళ్ళు దిమ్మెల వ్యవహారం తెరపైకి తెచ్చారన్నారు. ఈ సమావేశంలో డీసీఎమ్మెస్ డైరెక్టర్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు మరికంటి ధనలక్ష్మి, సీడీసీ మాజీ చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, పీఏసీఎస్ నేలకొండపల్లి, నాచేపల్లి అధ్యక్షులు కోటి సైదారెడ్డి, తన్నీరు సత్యనారాయణ, నాయకులు శాఖమూరి సతీష్, యాతాకుల భాస్కర్, పొడుగు శ్రీను, చాగంటి మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో అధికారుల ఆకస్మిక తనిఖీలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

పెనుబల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలంలోని విత్తన దుకాణాలను ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో ప్రసాదరాజు, ఎస్‌ఐ వెంకటేష్ గురువారం తనిఖీ చేశారు. మండలంలోని దుకాణాల్లో స్టాక్ వివరాలు, రిజిస్ట్రర్లను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలని సూచించారు. రాత్రి వేళల్లో ఎవరైనా గోనెసంచుల్లో విత్తనాలను విక్రయించేందుకు వస్తే తమకు సమాచారం అందించాలని అలాగే హెచ్‌టీ పత్తి(బీజీ111)సాగు చేయవద్దని వీటిని భారత ప్రభుత్వం నిషేధించిందని వాటిని సాగుచేసిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సాగుపై సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, పోలీసుల సహకారంతో అక్రమార్కులపై పీడీయాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు విత్తనాలను అమ్మకాలు జరిపే విత్తన డీలర్ల దుకాణాలను మండల టాస్క్‌ఫోర్సు బృందం గురువారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన విత్తన దుకాణాల్లో స్టాక్, ఇన్వాయిస్, బిల్లు పుస్తకాలు సంబంధిత రిజిస్టర్లను కూడా తనిఖీ చేశారు. విత్తనచట్టం 1966 నియమ నిబంధనలకు లోబడి విత్తనాలు క్రయవిక్రయాలు చేయాలని తెలిపారు. రైతులకు విత్తనాలు అమ్మేటప్పుడు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందం ఎస్‌ఐ రమేష్, ఏవో సాయిశివ, ఏఈవోలు పాల్గొన్నారు.

చింతకాని, మే 29 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రశీదు తప్పకుండా ఇవ్వాలని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర తెలిపారు. గురువారం మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో పలు విత్తన దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. విత్తన ప్యాకెట్లపై తయారీ తేదీ, గడువు తేదీలను పరిశీలించారు. ఏవో సోములపల్లి మానస, ఏఈవోలు పాల్గొన్నారు.

అరకొర మద్దతు ధరలతో రైతులకు అన్యాయం

కొణిజర్ల, మే29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అరకొరగా నిర్ణయించిన మద్దతు ధరలతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం లాలాపురం గ్రామంలో జరిగిన ధాన్యం రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2025 ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌కు ప్రకటించిన అరకొర మద్దతు ధరలు రైతులను సాగులో స్థిరంగా కొనసాగించలేవని అన్నారు. 14రకాల వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరల పెంపు చాలా నామమాత్రం అని తెలిపారు. పెరిగిన ఖర్చులు ఆధారంగా మద్దతు ధర నిర్ణయించి ప్రభుతమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గోపవరం సొసైటీ డైరక్టర్ సంక్రాంతి నర్సయ్య, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, మాధవ్ పాల్గొన్నారు.

రసాయన ఎరువులను తగిన మోతాదులో వేయాలి

కల్లూరు, మే29 (ఆంధ్రజ్యోతి) రసాయనిక ఎరువులను తగిన మోతాదులో వాడాలిని వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని ముచ్చవరం గ్రామంలో గురువారం వ్యవసాయ, ఉద్యాన శాఖల తరుపున రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువగా యూరియా వాడుతూ సాగు ఖర్చులను తగ్గిస్తూ రైతులు లబ్ధిపొందాలని కోరారు. అవసరమైన మేరకు రసాయనాలను వినియోగించి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య మాట్లాడుతూ.. సాగు నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. చెట్లను పెంచి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని రైతులను కోరారు. పంట మార్పిడిని పాటిస్తూ సుస్థిర ఆదాయాన్ని పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు కూరగాయల సాగు వైపు మొగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు పవన్, వెంటకలీల, సందీప్, పలువురు రైతులు పాల్గొన్నారు.

చెత్తలో 'ఊరు'



చెత్తలో పడిఉన్న కొణిజర్ల గ్రామ సూచిక బోర్డు

కొణిజర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): "ధన్యవాదాలు నేను కొణిజర్ల గ్రామపంచాయతీ సూచికబోర్డును. నన్ను చెత్తలో పడేశారు. కాస్త కన్నెత్తి చూసి నున్న సరిచేయండి అన్నట్లు కనిపిస్తుంది కొణిజర్ల గ్రామ పంచాయతీ సూచిక బోర్డు". కొణిజర్ల నుంచి బస్వాపురం వెళ్లుతుండగా కొణిజర్ల గ్రామం ముందు ధన్యవాదలు కొణిజర్ల గ్రామ పంచాయతీ అంటూ సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. అదికాస్త క్రిందపడి చెత్తలో కూరుకుపోతోంది. నిత్యం అదే రహదారి వెంట తిరిగే అధికారులకు మాత్రం అది కనిపించకపోవడం గమనార్హం. బోర్డునే పట్టించుకోని వారికి ప్రజల బాగోగులు పట్టేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

కారేపల్లి,మే29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాధారం డొలమెంట్ మైన్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను మైన్స్ యాజమాన్యం పర్మినెంట్ చేయాలని టీయుసీఎల్ జిల్లా కార్యదర్శి జి.రామయ్య డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు మైనస్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు రామయ్య మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని సుప్రింకోర్టు తీర్పు ప్రకారం అమలచేయాలన్నారు. నష్టల పేరిట ప్రతి ఎడాది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలనే ఆలోనను విరమించుకోవాలన్నారు. ధరవాత్ సక్రు, ఎస్‌కే కైరుద్ధీన్, వీరు, ఇబ్రహీం, హుస్సైన్, రవి పాల్గొన్నారు.

స్త్రీశక్తి టీస్టాల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

తల్లాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని స్త్రీశక్తి దేవహోత్రేయ స్త్రీ టీ స్టాల్‌ను గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సందర్శించారు. ఈ సందర్భంగా టీస్టాల్ లో ఆమె తేనీరు సేవించారు ఈ కార్యక్రమంలో మందల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, ఏఎంసీ మాజీచైర్మన్ దుండేటి వీరారెడ్డి, జక్కంపుడి రమేష్, పాల్గొన్నారు.

రాయగూడెంలో రేపు బొడ్రాయి ప్రతిష్ఠ

నేలకొండపల్లి,మే29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయగూడెం గ్రామంలో శనివారం బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. గురువారం పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం బొడ్రాయి ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తారు. 31వతేదీ శనివారం ఉదయం 8.12కు ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 10గంటలకు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కమిటీ కోరింది.



ప్రత్యేక పూజలు చేస్తున్న రాయగూడెం గ్రామస్థులు

గురుకులాల కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,మే29(ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమ గురుకులాల విద్యార్థులను ఆగౌరవ పరిచిన ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణీపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఖమ్మంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందించారు. ఎస్సీ గురుకులాల్లో విద్యార్థులు టాయిలెట్స్ శుభ్రం చేయాలని కార్యదర్శి మాట్లాడితే క్షేత్రస్థాయిలో గురుకులాలకు ఎటువంటి సందేశాలను పంపుతున్నారని ప్రశ్నించారు. వెంటనే గురుకులాల కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



భట్టికి వినతిపత్రం అందిస్తున్న రామకృష్ణ

కాంగ్రెస్ పాలనలోనే అన్నివర్గాలకు మేలు

తిరుమలాయపాలెం, మే29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలోనే అన్నివర్గాలకు మేలు జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి తెలిపారు గురువారం మండలంలని మహ్మదాపురం, తిప్పారెడ్డిగూడెం, మేకలతండాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరుచేసిన ఇళ్లపట్టాలను ఆయన పంపిణీచేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలుతీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రజలకు సంక్షేమపథకాల అమల్లో వివక్ష చూపారన్నారు కాంగ్రెస్ పార్టీ అర్హులైన వారికి ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులు అందిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బోడపట్ల నరసయ్య, సునిత, నాయకులు రామారావు, పాల్గొన్నారు.



మహ్మదాపురంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న నరేష్‌రెడ్డి

ఘనంగా టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి,మే29(ఆంధ్రజ్యోతి):టీపీటీఎఫ్ 12వఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మనోహర్‌రాజు హాజరై జెండా ఎగురవేసి ఉత్సవాలను ప్రారంభించారు. పాలకుల వైఖరి వల్ల అనేక సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి నేటికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదని అన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.నాగిరెడ్డి, విజయ్, పద్మ, వెంగళరావు, ఉమాదేవి పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

తల్లాడలో తిరంగా ర్యాలీ

తల్లాడ మే 29 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని అణిచి వేయటంలో అపరేషన్ సిందూర్ విజయం సాధించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. గురువారం రాత్రి తల్లాడలో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. కేతినేని థియేటర్ నుంచి నారాయణపురంలోని రామాలయం వరకు యాత్ర జరిగింది. జాతీయ పతాకాలను చేబూని వందలాది మంది యాత్రలో పాల్గొన్నారు. బిజెపి రాష్ట్ర, జిల్లా నాయకులు రమేష్, కృష్ణారావు, బాలజీనాయక్, మండల అధ్యక్షుడు చల్లా నాగులు, కిరణ్, నరేష్, ప్రముఖ వ్యాపారులు నారాయణరావు పాల్గొన్నారు.

స్త్రీ టీ స్టాల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే


తేనీరు సేవిస్తున్న ఎమ్మెల్యే

తల్లాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని శ్రీశక్తి దేవహోత్రేయ స్త్రీ టీ స్టాల్‌ను గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సందర్శించారు. ఈ సందర్భంగా టీస్టాల్ లో ఆమె తేనీరు సేవించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, ఏఎంసీ మాజీచైర్మన్ దుండేటి వీరారెడ్డి, జక్కంపుడి రమేష్, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉద్యమాన్ని జయప్రదం చేయండి

తల్లాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల సాధన కోసం వచ్చే నెల 8న ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి ఉద్యమ కార్యచరణ సభను జయప్రదం చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ ధశరద్‌నాయక్ కోరారు. గురువారం తల్లాడ మండల మల్సూరుతండాలో జరిగిన సమావేశంలో ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. కులగణనలో లంబాడీ జనాభ శాతాన్ని బహిర్గతం చేయాలని గోర్‌బోలతీ భవాషను అధికారికంగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం 8 వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు.

నైరుతి ఆగమనం.. పలకరించిన తొలకరి..

» వానాకాలం వ్యవసాయ సాగుకు రైతుల శ్రీకారం

» పత్తి, వరి విత్తనాలు వేస్తున్న అన్నదాతలు

కల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ఆగమనంతో కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు దుక్కులు దున్ని వరి నార్లు పోసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మండల పరిధిలో పలు గ్రామాల్లోని రైతులు 60 శాతం పైగా వరి పొలాల్లో దుక్కులు దున్నారు. నైరుతి ఆగమనంతో అడపాదడపాగా కురిసిన వర్షాలకు భూముల్లో తేమ ఏర్పడడంతో నారు మడులను సిద్ధం చేసుకుని వరి విత్తనాలు చల్లుతున్నారు. ఈ ఏడాది వర్షకాల సీజన్ ఆశాజనకంగా ఉంటుందని శాస్త్రవేతలు కూడా చెబుతుండడంతో రైతులు సంబర పడుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వరి సాగులో అగ్రగామిగా నిలిచిన కల్లూరు మండలంలో 33,350 పైగా ఎకరాల్లో వరి సాగు అవుతుంది. మండల పరిధిలోని వాచ్యానాయక్‌తండా, బోడిమెల్లి, చంద్రుపట్ల, ఎర్రబోయినపల్లి గ్రామాల్లో పలువురు రైతులు వరి నార్లు పోస్తున్నారు. ప్రతి ఏడాది వ్యవసాయ సీజన్‌లో


వాచ్యానాయక్‌తండాలో నారు పోస్తున్న రైతు


పత్తి విత్తనాలు వేసేందుకు దున్నుతున్న దృశ్యం

మండల పరిధిలో గల పలు గ్రామాల రైతులు వరి సాగుకు ముందస్తుగా సిద్ధం అవ్వటం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. వరి దిగుబడి కూడా కల్లూరు ప్రాంతంలో ముందస్తుగా అవుతుంది. దీంతో పంట దిగుబడి కూడ ఆశాజనకంగా ఉంటుందిని భావిస్తున్న రైతులు వరి విత్తనం సాగులో ముందంజలో ఉన్నారు. వేదజల్లే పద్దతిలో వరి సాగు చేస్తున్న రైతులు మాత్రమే పచ్చిరొట్ట వత్తనాలను చల్లుతున్నారు. ఇక మండలంలోని లక్ష్మీపురం, బత్తుపల్లి, కప్పలబంధం, చిన్నకోరుకొండి, పోచారం, తాళ్లూరు, వెంకటాపురం, మర్లపాడు, తెలగవరం గ్రామాల రైతులు మెరక భూముల్లో దుక్కులు దున్ని పత్తి విత్తనం నాటేందుకు సిద్ధమవుతున్నారు.

కొణిజర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): మే లోనే వర్షాలు పడడంతో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధం అయ్యారు. ఆయా గ్రామాల్లో రైతులు ముందస్తుగా కురుస్తున్న తొలకరి వానలతోనే పత్తిసాగు చేపట్టారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో రైతులు దుక్కులు దున్ని పత్తి విత్తనాలు చల్లుతున్నారు. పొడిదుక్కుల్లో విత్తనాలు నాటొద్దని అధికారులు చెబుతున్నా రైతులు మాత్రం పదును పోతుందని విత్తనాలు చల్లుతున్నారు. గతంలో కంటే పత్తిసాగు ఈ ఏడాది అధికంగా పెరిగే అవకాశం ఉంది. రైతులు మాత్రం విత్తనాలు వేసేందుకే సుముకత చూపుతున్నారు. మండలంలో చాలా వరకు రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. గత రెండేళ్ళ నుంచి పత్తిసాగు కలిసిరావడంలేదని, ఈ సారైన పంట దిగుబడి వస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

కారేపల్లి మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు వ్యవసాయపనులకు శ్రీకారం చుట్టారు .వేసవి కాలంలోనే అనుకోకుండ వర్షాలు కురుస్తుండడంతో ముందుగానే దుక్కులు దున్నుకుని విత్తానాలు విత్తుకునేందకు సమయత్తం అవుతున్నారు.గత వారం రోజులుగా మండల వ్యాప్తింగ వర్షాలు కురుస్తుండటంతో రైతులు హర్షంవక్తం చేస్తు వ్యవసాయపనులకు శ్రీకారంచుట్టారు.ట్రాక్టర్‌లతో దుక్కులు దునున్నకుంట ఎరువాకకు సమయత్తం అవుతున్నారు. ఇప్పటికే పంటలసాగుపై అవగాహనకు వచ్చిన రైతులు విత్తుకునేవిత్తానాలను ముందుగానే కొనుగోలుచేసుకుంటున్నారు. అధికంగా పత్తి విత్తానాల పైనే ముందస్తు దృష్టిసారించారు.

రైతులు తొందరపడొద్దు: ఏవో బాలాజి

ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు రైతులు తొందరపడి పంటలను సాగు చేస్తున్నారు. ఇది సరైన సమయం కాదు. ఈ వర్షాలకు భూమి మొత్తం పదును కాదు. కనీసం పది సెంటీమీటర్లు భూమి తడిసిన తర్వాతనే విత్తనాలు సాగు చేయాలి. రైతులు వానకాలం పంటలు సాగు చేసేందుకు ఓపిక పట్టాలి. పొడి పొలల్లో విత్తనాలు వేసి నష్టపోవద్దు. భూమి తడిసిన తార్వత విత్తనాలు చల్లితే మొలకలు పూర్తి స్తాయిలో వస్తాయి.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న భట్టి

లచ్చగూడింలో భట్టి పర్యటన

చింతకాని, మే 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా చింతకాని కిసాన్ సెల్ మండల అధ్యక్షడు, ఆత్మ కమిటీ సభ్యుడు కొప్పుల గోవిందరావు కుమార్తె వివాహం ఇటీవల జరగడంతో భట్టి నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండల నాయకులతో సమావేశమై అభివృద్ధి విషయాలపై చర్చించారు. అనంతరం గ్రామస్థుల వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వైరా ఎమ్మెల్యే రాందాసు నాయక్, డీసీసీ అధ్యక్షడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, బందెల నాగార్జున, పెంట్యాల అప్పారావు, మాజీ సర్పంచ్ గొడుగు రమేష్, శ్రీరాములు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

కారేపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాధారం డొలమైట్ మైన్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను మైన్స్ యాజమాన్యం పర్మినెంట్ చేయాలని టీయుసీఎల్ జిల్లా కార్యదర్శి జి.రామయ్య డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు మైనస్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు రామయ్య మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని సుప్రింకోర్టు తీర్పు ప్రకారం అమలచేయాలన్నారు. నష్టల పేరిట ప్రతి ఎడాది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలనే ఆలోనను విరమించుకోవాలన్నారు. ధరవాత్ సక్రు, ఎస్కే ఖైరుద్ధీన్, వీరు, ఇబ్రహీం, హుస్సేన్, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో అధికారుల తనిఖీలు

పెనుబల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలంలోని విత్తన దుకాణాలను ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో ప్రసాదరాజు, ఎస్ఐ వెంకటేష్ గురువారం తనిఖీ చేశారు. మండలంలోని దుకాణాల్లో స్టాక్ వివరాలు, రిజిస్ట్రర్లను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలని సూచించారు. రాత్రి వేళల్లో ఎవరైనా గోనెసంచుల్లో విత్తనాలను విక్రయించేందుకు వస్తే తమకు సమాచారం అందించాలని అలాగే హెచ్‌టీ పత్తి(బీజీ111)సాగు చేయవద్దని వీటిని భారత ప్రభుత్వం నిషేధించిందని వాటిని సాగుచేసిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సాగుపై సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, పోలీసుల సహకారంతో అక్రమార్కులపై పీడీయాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.


దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఎర్రుపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు విత్తనాలను అమ్మకాలు జరిపే విత్తన డీలర్ల దుకాణాలను మండల టాస్క్‌ఫోర్సు బృందం గురువారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన విత్తన దుకాణాల్లో స్టాక్, ఇన్వాయిస్, బిల్లు పుస్తకాలు సంబంధిత రిజిస్టర్లను కూడా తనిఖీ చేశారు. విత్తనచట్టం 1966 నియమ నిబంధనలకు లోబడి విత్తనాలు క్రయవిక్రయాలు చేయాలని తెలిపారు. రైతులకు విత్తనాలు అమ్మేటప్పుడు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. టాస్కుఫోర్స్ బృందం ఎస్ఐ రమేష్, ఏవో సాయిశివ, ఏఈవోలు పాల్గొన్నారు.

చింతకాని, మే 29 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రశీదు తప్పకుండా ఇవ్వాలని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర తెలిపారు. గురువారం మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో పలు విత్తన దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. విత్తన ప్యాకెట్లపై తయారీ తేది, గడువు తేదీలను పరిశీలించారు. ఏవో సోములపల్లి మానస, ఏఈవోలు పాల్గొన్నారు.

ఆశీర్వాదంకు సండ్ర నివాళి


ఆశీర్వాదంకు నివాళులర్పిస్తున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర

తల్లాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో పినపాకలో మృతి చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు మోదుగు ఆశీర్వాదంకు గురువారం రాత్రి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నివాళులర్పించారు. ఆశీర్వాదం మృతదేహంపై పూలమాల వేసి సండ్ర అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనువాసరావు, వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకటలాల్, వజ్రాల రాంరెడ్డి, జమలయ్య, కొటిరెడ్డి, వీరకృష్ణ, జివిఆర్, పాల్గొన్నారు.

చెత్తలో 'ఊరు'


చెత్తలో పడిఉన్న కొణిజర్ల గ్రామ సూచిక బోర్డు

కొణిజర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): "ధన్యవాదాలు నేను కొణిజర్ల గ్రామ పంచాయతీ సూచికబోర్డును. నన్ను చెత్తలో పడేశారు. కాస్త కన్నెత్తి చూసి నున్న సరిచేయండి అన్నట్లు కనిపిస్తుంది కొణిజర్ల గ్రామ పంచాయతీ సూచిక బోర్డు". కొణిజర్ల నుంచి బస్తాపురం వెళ్లతుండగా కొణిజర్ల గ్రామం ముందు ధన్యవాదలు కొణిజర్ల గ్రామ పంచాయతీ అంటూ సూచికబోర్డును ఏర్పాటు చేశారు. అదికాస్త క్రిందపడి చెత్తలో కూరుకుపోతోంది. నిత్యం అదే రహదారి వెంట తిరిగే అధికారులకు మాత్రం అది కనిపించకపోవడం గమనార్హం. బోర్డునే పట్టించుకోని వారికి ప్రజల బాగోగులు పట్టేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం


ప్రథమ, ద్వితీయ విజేత జట్లకు షీల్డ్ అందిస్తున్న ఎమ్మెల్యే

ఏన్కూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్నట్టు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. ఏన్కూరులో ఈనెల 15నుంచి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు పోటీల్లో పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. కారేపల్లి ప్రథమ, ఏన్కూరు ద్వితీయ, రామానుజారం తృతీయ, ఏన్కూరు నాలుగు బహుమతలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా దాదాపు ఐదువేల ఉద్యోగాలు కల్పించమన్నారు. దశలవారీగా నియోజకవర్గంలోని నిరుద్యోగులందరికి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయన్నారు. మండలపార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, నాయకులు మేడా ధర్మారావు ముక్తి వెంకటేశ్వర్లు, చందమామ నరసింహారావు, లచ్చిరాం నాయక్, కూరాకుల వెంకటేశ్వర్లు, గుంటుపల్లి వెంకటేశ్వర్లు, కొప్పులప్రభావతిరెడ్డి, వేముల రమేష్ తదితరులు పాల్గొన్నార.

ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం

సత్తుపల్లి/కల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపల్ కార్యాలయంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ కె.నరిసింహ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం అందిన 45 రోజుల్లోగా ఇంటి నిర్మాణం మొదలు పెట్టాలని కోరారు. పునాది స్థాయికి రూ. లక్ష, స్లాబ్ పూర్తయ్యాక రెండు లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తియ్యాక మరో రూ. లక్ష చొప్పున మొత్తం ఐదు లక్షలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమా చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 400 నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి కొలత ఉండాలని సూచించారు. గృహ నిర్మాణశా ఏఈ పవన్, మున్సిపాల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

కల్లూరులో..

కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ చంద్రశేఖర్ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో క్షేత్ర స్థాయిలో చూపించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ రంజిత్‌కుమార్, హౌసింగ్ అధికారి, పంచాయితీ కార్యదర్శిలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కె.రవికుమార్

కల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులను తగిన మోతాదులో వాడాలని వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని ముచ్చవరం గ్రామంలో గురువారం వ్యవసాయ, ఉద్యాన శాఖల తరుపున రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువగా యూరియా వాడుతూ సాగు ఖర్చులను తగ్గిస్తూ రైతులు లబ్ధిపొందాలని కోరారు. అవసరమైన మేరకు రసాయనాలను వినియోగించి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య మాట్లాడుతూ.. సాగు నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. చెట్లను పెంచి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని రైతులను కోరారు. పంట మార్పిడిని పాటిస్తూ సుస్థిర ఆదాయాన్ని పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు కూరగాయల సాగు వైపు మొగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు పవన్, వెంటకలీల, సందీప్, పలువురు రైతులు పాల్గొన్నారు.

కూడలిలో పశువుల సంచారం

తల్లాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే మూడుజాతీయ రహదారులకు కేంద్రమైన తల్లాడ రింగ్‌రోడ్డులో పశువులు సంచరిస్తున్నాయి. తల్లాడ- వరంగల్, తల్లాడ- కుంట, తల్లాడ -దేవరపల్లి జాతీయ రహదారులకు తల్లాడ కేంద్రంగా ఉన్న రింగ్‌రోడ్డు ఆవులు సంచరిస్తున్నాయి. చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఒకటో వార్డులో వెలగని వీధిలైట్లు

వైరా, మే 29 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలోని ఒకటో వార్డు పరిధిలో గల పలు వీధుల్లో 20రోజులుగా వీధిలైట్లు వెలగటం లేదు. ఆ వీధుల్లో గాఢాంధకారం ఏర్పడింది. వీధిలైట్లు వెలగని విషయమై మునిసిపల్ అధికారులకు తాము అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆ వార్డు ప్రజలు విమర్శిస్తున్నారు. బీసీ కాలనీ, పాత ఎక్సైజ్ స్టేషన్ రోడ్డు, ఇతర ప్రాంతాల్లోని వీధుల్లో లైట్లు వెలగక చీకట్లో ఇబ్బందులు పడుతున్నామని అక్కడి ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా బీసీ కాలనీలో కొన్ని కరెంట్ స్తంభాలు మధ్యభాగానికి విరిగిపోయి కూలిపోయే ప్రమాదకర స్థితిలో ఉన్నా మునిసిపల్, ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. గాఢాంధకారం నుంచి తమకు విముక్తి కల్పించాలని ఆ వార్డు ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.


మధ్యకు విరిగిన విద్యుత్ స్తంభం

వందరోజుల యాక్షన్ ప్లాన్


సమీక్షిస్తున్న కమిషనర్ వేణు

వైరా, మే 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో భాగంగా జూన్ రెండో తేదీ నుంచి సెప్టెంబర్ తొమ్మిదో తేదీ వరకు వందరోజులు యాక్షన్ ప్లాన్ ద్వారా పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వందరోజుల్లో చేపట్టాల్సిన పనులపై గురువారం వైరా మునిసిపల్ కమిషనర్ చింతా వేణు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కాల్వల్లో పూడిక తీత, రోడ్ల శుభ్రత, మొక్కలు నాటడం, అంటువ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు, ఇంటింటికి మొక్కల పంపిణీ, వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్షించారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు బి.నర్సింహమూర్తి, సుధీర్‌బాబు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ బత్తుల వెంకట్రావ్ పాల్గొన్నారు.

మామిళ్లపల్లికి ప్రముఖుల నివాళి

సత్తుపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం కిష్టారం సొసైటీ చైర్మన్ మామిళ్లపల్లి కృష్ణయ్యకు పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. గురువారం కృష్ణయ్య దశదిన కర్మ సందర్భంగా వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృష్ణయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. టీజీ ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ బ్రహ్మయ్య, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు మామిళ్లపల్లి కృష్ణయ్య దశదిన కర్మకు హాజరయ్యారు.


కృష్ణయ్యకు మంత్రి తుమ్మల నివాళి


కృష్ణయ్యకు నివాళి అర్పిస్తున్న మువ్వా, బాలసాని


నివాళులర్పిస్తున్న సండ్ర వెంకటవీరయ్య

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

» డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క

» రూ.9.49 కోట్ల నిధులతో వేయనున్న బీటీ రోడ్లకు శంకుస్థాపన

బోనకల్, మే 29 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికి సంక్షేమ పథకాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క స్పష్టం చేశారు. మండలంలో గురువారం రూ. 9.49 కోట్ల నిధులతో వేయనున్న బీటీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ముందుగా గార్లపాడు నుంచి రామాపురం మీదుగా నాగులవంచ గ్రామం వరకు రూ. 2.23 కోట్ల నిధులతో వేయనున్న రోడ్డుకు, చిన్నబీరవల్లి నుంచి నారాయణపురం వరకు రూ. 4.50 కోట్ల నిధులతో వేయనున్న రోడ్డుకు, బోనకల్ ఇందిరా డెయిరీ నుంచి రావినూతల వరకు రూ. 2.76 కోట్ల నిధులతో వేయనున్న రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రోడ్ల నిర్మాణాలకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. చిన్నబీరవల్లి, గార్లపాడు గ్రామాల్లో మహిళలు ఘన స్వాగతం పలికారు. తిలకం దిద్ది హారతులు ఇచ్చారు. పలు సమస్యల పై ప్రజలు భట్టికి వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్‌అండ్‌బీ ఈఈ తానేశ్వర్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో రమాదేవి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా మండల నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, కర్నాటీ రామకోటేశ్వరరావు, గాలి దుర్గారావు, మోదుగు సుదీర్‌బాబు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, తమ్మారపు బ్రహ్మయ్య, కళ్యాణం నాగేశ్వరరావు, గూడ నర్సయ్యశాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.


డైరీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం